ఈనాడు
హైదరాబాద్
HMDA

మంగళవారం 15 ఆగస్టు 2017 | 24 పేజీలు

నగర రథం... అభివృద్ధి పథం

సరైన ప్రణాళికలతోనే ప్రజలకు స్వాతంత్ర్య ఫలాలు



● మూడేళ్లలో మహిళలపై నేరాలు 14 శాతం తగ్గాయి. వారి భద్రతకు షి బృందాలు వినూత్న ఆలోచనలకు పదును పెడుతున్నాయి.



● సర్కారు పాఠశాలలకు మంచి రోజులు వచ్చేలా... వివిధ కార్పొరేట్ సంస్థల సహకారంతో అధునాతన వసతులను సమకూర్చుకుంటున్నాయి.



● వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు అమలవుతోంది. బహుళ అంతస్తుల పైవంతెనలు, ఆకాశ, భూగర్భ మార్గాలు, ఊగే వంతెన నగరవాసుల కళ్లెదుట ఆవిష్కృతం చేసే పనులు కొనసాగుతున్నాయి.



● ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ ప్రాంతాల్లో గోల్ఫ్ మైదానాలు, బుద్వేల్ వద్ద జలదృశ్యాలతో అతి పెద్ద ఆక్వేరియం, నీటి మడుగులో హోటళ్లు, విందు వినోదాలకు వీలుగా ఏర్పాట్లు సాగుతున్నాయి.



● ఎంఎంటీఎస్ రెండో దశలో 96 కిలోమీటర్లు మార్గం నిర్మాణంతో పాటు ఆరేడు లక్షల మంది ప్రయాణికులను అదనంగా తరలించే లక్ష్యంగా ద.మ. రైల్వే అడుగులు వేస్తోంది.



● సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.300 కోట్లతో ప్రణాళికలు ఉన్నాయి.



● సొంతింటి కల నెరవేర్చే దిశగా సరికొత్త ప్రణాళికలు అమలవుతున్నాయి. పలు ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.



● ఏటా కోటి మంది పర్యాటకులను ఆకర్షించేలా ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆకట్టుకునే కట్టడాలు, ప్రదేశాలకు సరికొత్త హంగులు తీసుకు వస్తున్నారు.





● మూసీ కొత్తందాలను దిద్దుకోనుంది. బోటింగ్, నడకదారి, సైకిల్ మార్గం ప్రతిపాదిస్తున్నారు. ఉద్యానవనాలు, చెక్‌డ్యాంలు నది స్వరూపాన్ని మార్చనున్నాయి.



● రూ.1900 కోట్లతో శివారు ప్రాంతాల్లో తాగు నీటి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఏడాదిలో ఇవి అందుబాటులోకి రావాల్సి ఉంది.

● వచ్చే అయిదేళ్లలో కేశవపూర్ వద్ద 20 టీఎంసీల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అందుబాటులోకి తెస్తున్నారు. భూసేకరణకు రంగం సిద్ధం చేస్తున్నారు.



● ప్రభుత్వ వైద్య సేవలకు అధునాతన హంగులొస్తున్నాయి. ఈ ఏడాదిలో 20 శాతం రోగులు పెరిగారు. ఇప్పటికే గాంధీ, నిమ్స్, నిలోఫర్, పేట్లబుర్జు ఆసుపత్రుల్లో ఆధునిక వసతులొచ్చాయి.

ప్రత్యేక కథనాలు మధ్య పేజీల్లో



ఉట్టి... ఉత్సాహంగా కొట్టి...

శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలతో నగరం పునీతమైంది. చిన్నారులకు కృష్ణుడి వేషధారణలు వేసి తల్లిదండ్రులు మురిసిపోయారు. యువతీ యువకులు ఉట్టి కొట్టే సంబరాల్లో ఉత్సాహంగా మునిగితేలారు. పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ...మరిన్ని చిత్రాలు10, 11లలో

'మత్తు'పై చైతన్యమే లక్ష్యం

● ఆధార్‌తో ముడిపెట్టాలని డిమాండ్
● నేటి నుంచి పోస్టుకార్డు ఉద్యమం

సంపూర్ణ మద్య నిషేధం లక్ష్యంగా పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు సాగుతున్నాయి. గాంధీజీ కలలు కన్న సమాజం కోసం సంపూర్ణ మద్య నిషేధం అమలులోకి రావాలని సదస్సులు నిర్వహిస్తున్నాయి. మద్యానికి, డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని ప్రచారం, ర్యాలీలు నిర్వహించాయి. ఆధార్ కార్డు ఉంటేనే మద్యాన్ని అమ్మే విధానాన్ని అమలు చేయాలని ఆగస్టు 15 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నాయి. ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న యువజన, మహిళా సంఘాల మద్దతు కోరామని స్ఫూర్తి గ్రామీణాభివృద్ధి సంక్షేమ సేవా సంఘం సభ్యులు పేర్కొన్నారు. మద్యం అమ్మకాలను ఆధార్‌తో అనుసంధానం చేయాలని ఒకటి ముఖ్యమంత్రి, మరొకటి ప్రధానమంత్రి పేరునా పోస్టు కార్డులను పంపాలని వారు కోరుతున్నారు. తమ ఉద్యమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో పలు స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు సహకారం అందిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపక కార్యదర్శి పుట్టా రామకృష్ణ తెలిపారు.

–ఈనాడు, హైదరాబాద్

తప్పుడు సిమ్‌లు.. తప్పవు ఊచలు



● దొంగ పత్రాలతో సిమ్ కార్డు తీసుకున్నా ఇచ్చినా జైలుకే...
● కేంద్రం మార్గదర్శకాలతో సిటీ పోలీసుల కార్యాచరణ
● వినియోగదారుల సేవా కేంద్రాలు... నెట్‌వర్క్ కంపెనీలపైనా కేసులు

ఈనాడు, హైదరాబాద్

తప్పుడు పత్రాలతో సిమ్‌కార్డులు తీసుకున్నా, వాటిని విక్రయించినా... ఇద్దరూ జైలుకు వెళ్లనున్నారు. అంతేకాదు.. సిమ్‌ను పనిచేసేలా చేసిన కస్టమర్ కేర్ నిర్వాహకులనూ పోలీసులు వదలరు. ఉగ్రవాదులు, నేరగాళ్లు విచ్చలవిడిగా సిమ్‌కార్డులను వినియోగిస్తుండడం, ముందస్తుగా యాక్టివేషన్ అయిన కార్డులూ మార్కెట్‌లోకి వస్తుండడంతో సిటీ పోలీసులు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. హైదరాబాద్, ముంబయి, దిల్లీ, చెన్నై నగరాల్లో వేల సంఖ్యలో ప్రీయాక్టివేటెడ్ సిమ్‌కార్డులు ఉన్నాయన్న నిఘా వర్గాల సమాచారంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్తగా మార్గదర్శకాలను రూపొందించింది. వీటి ఆధారంగా మొబైల్ కంపెనీల దుకాణాలు, పాన్ డబ్బాలు, కస్టమర్ కేర్ కేంద్రాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించనున్నారు. కొద్దిరోజుల క్రితం 'కాల్ రూటింగ్' కేంద్రంపై దాడులు నిర్వహిస్తే ఇద్దరు నిందితుల వద్ద 778 సిమ్‌కార్డులు పోలీసులకు లభించాయి. ఇకపై వాటి విక్రయం వరకే మాకు సంబంధం అంటూ నెట్‌వర్క్ కంపెనీలు తప్పించుకునే అవకాశాలు లేవని పోలీసులు తెలిపారు.

ప్రతి పత్రం పక్కాగా...

సిమ్‌కార్డు కోసం ఇచ్చే పత్రాలు సక్రమంగా ఉండడంతో పాటు కొనుగోలు చేస్తున్న వ్యక్తి ప్రమాణ పత్రం ఉండాలి. సిమ్‌కార్డు దరఖాస్తు తీసుకున్నాక విక్రేత సమక్షంలో సంతకం పెట్టాలి. దరఖాస్తులో అతికించిన ఫొటో, దరఖాస్తుదారుడిని పోల్చుకున్నాకే విక్రేత/ఏజెంట్ సిమ్ కార్డును ఇవ్వాలి. సిమ్‌కార్డు ఇచ్చాక 24గంటల్లో సిమ్‌కార్డు పనిచేసేందుకు వెసులుబాటు కల్పించే కస్టమర్ కేర్ కేంద్రం కూడా దరఖాస్తుదారు వివరాలన్నీ మరోమారు క్షుణ్నంగా పరిశీలించాలి. కస్టమర్ కేర్ ప్రతినిధులకు అనుమానం వస్తే... సిమ్‌కార్డును యాక్టివేట్ చేయకుండా ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలి. లేని పక్షంలో టెర్మ్(టెలికాం ఎన్‌ఫోర్స్‌మెంట్ రీసోర్స్ మోనిటరింగ్ సెల్)కు సమాచారం ఇవ్వాలి. ఇవన్నీ చేయని పక్షంలో పోలీసులు తనిఖీలు నిర్వహించినప్పుడు కస్టమర్ కేర్ ...మిగతా 4లో

భార్యతో గొడవ పడి భర్త బలవన్మరణం

మొయినాబాద్: భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి విద్యుత్తు స్తంభం ఎక్కాడు. తల్లికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నాని చెప్పారు. బంధువులు, ఇతరులు స్తంభంపై నుంచి దిగాలని బతిమాలినా దిగలేదు. ఇంతలో పలువురు విద్యుత్తు అధికారులకు ఫోన్ చేసి సరఫరా నిలుపుదల చేయాలని.. వెంటనే స్పందించలేదు. ఇంతలో ఆ వ్యక్తి స్తంభంపైన ఉన్న తీగలను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎస్.సునీత తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం గోపులారం గ్రామానికి చెందిన పొడుగు మహేష్(26)కు ఐదేళ్ల క్రితం చేవెళ్ల మండలం ఊరేళ్ల గ్రామానికి చెందిన సుజాతతో వివాహమైంది. ఆదివారం మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామంలో ఉన్న తమ బంధువుల ఇంటికి వచ్చిన సుజాత దగ్గరకు మహేష్ వచ్చాడు. రాత్రి సమయంలో ఇద్దరి మధ్య తగాదా జరిగింది. అనంతరం మహేష్ అక్కడే ఉన్న ఓ విద్యుత్తు స్తంభంపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు దిగాడు. స్తంభంపై నుంచే తల్లికి ఫోన్ చేసి విషయాన్ని చెప్పారు. వెంటనే ఘటనా ప్రదేశానికి చేరుకున్న మహేష్ తల్లి స్తంభంపై నుంచి దిగాలని బతిమాలుతుండగానే తీగలను పట్టుకొని ఆత్మహత్య చేసుకున్నారు.

సమాచారం ఇచ్చినా.. సరఫరా నిలపని సిబ్బంది

ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తూ మహేష్ అరగంట పాటు విద్యుత్తు స్తంభంపై ఉన్నాడు. పలువురు గ్రామస్థులు, బంధువులు మొయినాబాద్ ట్రాన్స్‌కో ఏఈతోపాటు రెడ్డిపల్లి వద్ద ఉన్న 33/11కేవీఏ విద్యుత్తు ఉపకేంద్రంలోని సిబ్బందికి సమాచారం చేరవేశారు. అయినా సరఫరా నిలిపి వేసే విషయాన్ని వారు పట్టించుకోలేదు. ఇంతలో మహేష్ విద్యుత్తు తీగలను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డాడు. విషయం తెలుసుకున్న మొయినాబాద్ ఠాణా పోలీసులు ఘటనా ప్రదేశానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

భర్త ఎడబాటు భరించలేక భార్య ఆత్మహత్య

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: భర్త ఎడబాటును భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం ఇక్కడ వెలుగులోకి వచ్చింది. మల్కాజిగిరి పోలీసుల కథనం ప్రకారం.. మల్లికార్జున్‌నగర్‌లో నివసించే జి.కృష్ణ, విజయలక్ష్మి (58) భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు. ఏడాది క్రితం భర్త అనారోగ్యంతో మృతిచెందినప్పటి నుంచి ఆమె తీవ్ర మనోవ్యధకు గురైంది. ఒంటరితనంతో బాధపడుతూ భర్త జ్ఞాపకాలను మర్చిపోలేక ఇంట్లో ఎవ్వరూ లేనిసమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. మంటలకు తాళలేక కేకలు వేయగా స్థానికులు గమనించి మంటలార్పి ఆమెను గాంధీ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి కొడుకు సాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కత్తితో బెదిరించి నగదు చోరీ

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై ఓ వ్యక్తిని కత్తితో బెదిరించి నగదు ఎత్తికెళ్లిన సంఘటన ఘట్‌కేసర్ ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ బి.ప్రకాష్ వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన కళ్లం నరసింహా(53) సినిమా షూటింగ్ నిమిత్తం గుర్రపు బండితో హైదరాబాద్ వస్తుండగా.. ఆదివారం అర్ధరాత్రి ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డు వద్ద ఆగాడు. అక్కడ టీ తాగిన తరువాత బయలుదేరాడు. ఓఆర్ఆర్ మొదటి వంతెన వద్దకు రాగానే నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు బలవంతగా బండిని ఆపి అందులోకి ఎక్కారు. డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. తన వద్ద కేవలం రూ.300 మాత్రమే ఉన్నాయని చెప్పినా.. వినిపించుకొని దుండగులు అతడిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కత్తితో బెదిరించి అతని జేబులో ఉన్న రూ.5200 నగదును లాక్కొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.



బస్తీలపై మృత్యుపాశాలు

- **సీఎం చెప్పినా రెండేళ్లుగా తొలగని విద్యుత్తు తీగలు**
- **నిధుల కొరత పేరిట ప్రజల ప్రాణాలతో చెలగాటం**
- **తొలగింపునకు మరోసారి ముఖ్యమంత్రి ఆదేశం**

ఈనాడు, హైదరాబాద్

పేరుకు నగరంలో సొంతిల్లు.. బస్తీల్లో మేడ మీదికి ఎక్కి బట్టలు ఆరేసుకునే భాగ్యం కూడా లేని పరిస్థితి. కనీసం చేతులు కూడా పైకెత్తలేరు.. పొరపాటున చేయి ఎత్తారో ప్రాణాల మీద ఆశలు వదలుకోవాల్సిందే. నగరంలోని చాలా బస్తీల్లో ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు యమపాశాల్లా వేలాడుతున్నాయి. హైదరాబాద్ నగరాభివృద్ధిపై తాజాగా ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు తీగలను నివాసాల మీద నుంచి తొలగించాలని మరోసారి ఆదేశించారు. 2015లోనూ సీఎం ఆదేశించినా ఇప్పటివరకు డిస్కం అధికారులు తొలగించలేదు.

కనీసం ఈసారైనా తొలగేనా?

బస్తీవాసులు, కాలనీ వాసులు ఎన్నో ఏళ్లుగా తీగలు తొలగించాలని విద్యుత్తు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో ఒత్తిడి తీసుకొచ్చినా.. మంత్రుల సిఫారసులతో కార్పొరేట్ కార్యాలయాన్నే సంప్రదిస్తున్నా ఎలాంటి చొరవ లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన ఒకటి రెండు ప్రాంతాల్లో మాత్రమే నివాసాలపై నుంచి తీగలు తొలగించారు.

- జనావాసాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు తీగలకు సంబంధించి గ్రేటర్‌లో దక్షిణ విద్యుత్తు పంపిణీ సంస్థ సీఎం ఆదేశాలతో 2015లో ఒక నివేదిక రూపొందించింది. స్వచ్ఛ హైదరాబాద్ కమిటీ సూచన మేరకు నియోజకవర్గాల వారీగా తొలగించాల్సిన లైన్లను అయ్యే వ్యయంతో అంచనాలు రూపొందించారు. పలు దఫాలు ప్రజాప్రతినిధులతో సమావేశాల అనంతరం మొత్తంగా గ్రేటర్‌లో ప్రమాదకర తీగల మార్పిడికి రూ.280 కోట్లు కావాలని డిస్కం ప్రభుత్వానికి అప్పట్లో నివేదిక ఇచ్చింది. సర్కారు నుంచి నిధులు రాలేదని పనులను ప్రారంభించలేదు. సీఎం ఆదేశించారని



బాగ్‌లింగంపల్లిలో ఇళ్ల మధ్య ప్రమాదకరంగా హైటెన్షన్ తీగలు

ఎన్‌బీటీనగర్, పాటిగడ్డ మార్గంలో ప్రమాదకర తీగలను తొలగించారు. ఈ రెండు పనులకే దాదాపు రూ.10కోట్ల వరకు వ్యయం అయినట్లు డిస్కం చెబుతోంది. నగరంలోని ఇంకా 200 బస్తీల్లో ఇదే సమస్య ఉంది. పెద్ద తీగలకు సమీపంలో పదివేల ఇళ్ల వరకు ఉన్నట్లు అధికార్లు గుర్తించారు.

ఆర్ఆర్‌లోనూ ఉన్నాయి..

శివార్లలోనూ కొన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. ప్రతి నియోజకవర్గంలోనూ కనీసం పది చోట్ల కరెంట్ తీగల సమస్యలు ఉన్నాయి. వీటి తొలగింపునకు రూ.110 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ రెండేళ్లలో అక్కడక్కడ కొన్ని చిన్న పనులు మాత్రమే అధికారులు చేపట్టారు.

మార్చాలంటే అయ్యే అంచనా వ్యయం

- 33కేవీ లైన్లు- 119.72 కి.మీ - రూ.90.25 కోట్లు
- 11కేవీ లైన్లు -205.42 కి.మీ. - రూ.140.44 కోట్లు
- ఎల్‌టీ- 402.40 కి.మీ. - రూ.18.21 కోట్లు

మెట్రోజోన్‌లో అధికం..

గ్రేటర్‌లో విద్యుత్తు పంపిణీ పరంగా హైదరాబాద్ నార్త్, సౌత్, సెంట్రల్ సర్కిళ్లు మెట్రోజోన్ పరిధిలోకి వస్తాయి. ఇక్కడే అత్యధిక లైన్లు మార్చాల్సి ఉంది. సుమారు రూ.170 కోట్ల వరకు అవుతున్నట్లు ఇప్పటివరకు గుర్తించిన లైన్లను బట్టి అంచనా వేశారు. వీటిలోనూ అధికంగా మార్చాల్సిన లైన్లు పాతబస్తీలో ఉన్నాయి. ఎన్నో ఏళ్ల కిందట మొదట లైన్లు వేశారు. నగరం అభివృద్ధి చెందుతుండడంతో క్రమంగా లైన్ల కింద బస్తీలు వెలిశాయి. కొన్నిచోట్ల చిన్నరోడ్లు ఉండటంతో తీగలు ఇళ్లపక్కనుంచే వెళుతున్నాయి. 15 నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలోనే ఈ తరహా లైన్లు ఉన్నాయి. హెచ్‌టీ, 33కేవీ కంటే 11కేవీ ఎక్కువగా మార్చాల్సి ఉన్నట్లు ఇంజినీర్లు చెబుతున్నారు.

జూపార్కులో కొత్తగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు

చార్మినార్: నెహ్రూ జూపార్కులో కొత్తగా ఎన్‌క్లోజరుల సమీపంలో సీసీకెమెరాలను నెలకొల్పడానికి జూ అధికారులు సన్నాహాలు చేపట్టారు. ప్రస్తుతం జూలోని ప్రవేశ ద్వారంతోపాటు మరికొన్ని ప్రదేశాల్లో సీసీకెమెరాలు ఉన్నాయి. భద్రతపరంగా పోలీసులు సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలని జూ అధికారులకు సూచించడంతో సందడిగా ఉండే ఎన్‌క్లోజరుల సమీపంలో సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తద్వారా ఎన్‌క్లోజరులోని జంతువులను పోకిరి చేష్టలతో వేధించేవారిపై నిఘా కూడా సీసీకెమెరాల ఏర్పాటుతో సాధ్యమవుతుందని జూ అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా జూలో జనం సందడితో సమయంలో సందర్శకులకు జేబుదొంగల బెడదలు లేకుండా ఈ నిఘా ఉపయోగపడనుంది. దశలవారిగా జూలో సుమారు వంద సీసీకెమెరాలను నెలకొల్పాని అధికారులు భావిస్తున్నారు. జూలో కొత్తగా సీసీకెమెరాల ఏర్పాటు అంశాలను ఇటీవల జూ క్యూరేటరు శివానిడోగ్రా పరిశీలించారని జూ అసిస్టెంట్ క్యూరేటరు మురళీధర్ వివరించారు.

రైలు కిందపడి హెడ్‌కానిస్టేబుల్ కుమారుడి ఆత్మహత్య

కాచిగూడ, న్యూస్‌టుడే: రైలు కిందపడి ఏపీలోని విజయవాడ పోలీస్ రవాణా సంస్థ (పీటీవో) హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ విజయ్‌లాల్ కథనం ప్రకారం... ఒంగోలుకు చెందిన అంకారావు విజయవాడలోని పోలీస్ రవాణా సంస్థలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతను తన భార్య, కుమారుడు లక్ష్మణ్ (25)లతో కలిసి నగరంలోని వనస్థలిపురంలో నివాసం ఉంటున్నాడు. లక్ష్మణ్ బీటెక్ పూర్తి చేశాడు. ఆదివారం సాయంత్రం స్నేహితుని గృహ ప్రవేశానికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. సోమవారం ఉదయం మలక్‌పేట-డబీర్‌పుర స్టేషన్ల మధ్య యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. మృతుడి వద్ద లభ్యమైన సెల్‌ఫోన్ ఆధారంగా అతన్ని హెడ్‌కానిస్టేబుల్ కుమారుడిగా గుర్తించారు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చంపి.. బండరాయి కట్టి చెరువులో పడేసి..

గుర్తుతెలియని యువకుడి హత్య!

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో వెలుగు చూసిన ఓ దారుణ హత్యోదంతం కలకలం రేపింది. గుర్తు తెలియని యువకుడిని దుండగులు దారుణంగా అంతమొందించి బండరాయి కట్టి చెరువులో పడేశారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ పంచాయతీ పరిధి ఇనాంగూడ గ్రామంలోని బైరన్‌ఖాన్ చెరువులో ఓ వ్యక్తి మృతదేహం తేలుతున్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం ఉదయం అక్కడకు చేరుకొని పరిశీలించారు. ఇటీవల ఓ సినిమా చిత్రీకరణకు చెరువులో కర్రలు, చెక్కలతో కట్ట నుంచి లోతు ప్రాంతం వరకు ఓ వంతెన నిర్మించారు. హంతకులు ఈ వంతెన మీదుగా మృతదేహాన్ని చెరువులోకి తీసుకెళ్లి మృతదేహాన్ని పడేశారు. మృతుడి కాళ్లకి బండరాయి కట్టి ఉన్నట్లు గుర్తించారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండవచ్చు. యువకుడి దుస్తులు తీసేసి.. కాళ్లకు, మెడకు తాగుతో బిగించి బండరాయిని కట్టి నీటిలో ముంచినట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి చేతిపై వీ.ఎం.స్వాతి అని పచ్చబొట్టు ఉంది. హత్య జరిగి నాలుగైదు రోజుల అయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నరేందర్‌గౌడ్ సందర్శించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.



మృతుడి కాళ్లకు కట్టిన బండరాయి

స్వాతంత్ర్య వేడుకలకు.. ఏర్పాట్లు పూర్తి

గోల్కొండ: చారిత్రక గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దాదాపు 8 వేల మంది హాజరయ్యే అవకాశం ఉంది. భారీగా ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. ఏయే పాసులు గల వారు ఏ దారిలో వెళ్లాలనే సూచిక బోర్డులు పెట్టారు. వర్షం వస్తే తడవకుండా వీఐపీలు కూర్చునే చోట షెడ్‌ను అందుబాటులోకి తెచ్చారు. పరిసర ప్రాంతాలను సుందరంగా అలంకరించారు. ఉదయం 9.35కి రాష్ట్ర డీజీపీ అనురాగ్‌శర్మ, 9.40కి ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎస్.పి.సింగ్, 9.45కి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు కోటకు చేరుకోనున్నారు. ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ జరగనుంది. ఈ సందర్భంగా 5 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కోట, పరిసర ప్రాంతాల్లో పోలీసులను మోహరించారు. వేడుకలకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పశ్చిమ మండలం డీసీపీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులతో డీసీపీ సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. పోలీసులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ప్రశాంతి, ఆర్డీవో చంద్రకళ ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణంలోని కోటగోడలపైకి ఎక్కరాదని పురావస్తుశాఖ వారు బ్యానర్లు ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణం చుట్టూ ఉన్న రాణీమహల్, ఆయుధాగార గోడలపై 950 మంది కళాకారులు యక్షగానం, ఒగ్గుడోళ్లు, డప్పులు, కొమ్ముకోయా, గుస్సాడీ, లంబాడీ, మాధురీ, రాజన్నడోళ్లు, పేరిణి, ఒడిస్సీ, కథక్, కూచిపూడితోపాటు ముజ్రా, మర్ఫ, షేరీబ్యాండులను ప్రదర్శించనున్నారు. వేడుకల్లో తెలంగాణ కళాకృతులతోపాటు ప్రముఖ భారతీయ కళారూపాలన్నింటినీ ప్రదర్శించనున్నారు.





వేదిక దగ్గర ఏర్పాట్లు



యువత వేషధారణలు

హ్యామ్స్‌టెక్‌లో పంద్రాగస్టు వేడుకలు



సోమాజిగూడ, న్యూస్‌టుడే: పంద్రాగస్టును పురస్కరించుకుని పలు విద్యాసంస్థలు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా పంజాగుట్టలోని హ్యామ్స్‌టెక్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో జాతీయతను గుర్తుచేసే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దేశం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో ఆనాటి స్ఫూర్తిని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్థ అధికారులు అజితరెడ్డి, యోగేష్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కంటికింపు... మువ్వన్నెల సొంపు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగరవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతీయ పతాకాలు చేతబూని ప్రదర్శనలు చేస్తున్నారు. మువ్వన్నెల జెండా రెపరెపలాడుతుండగా ఓ యువతి కంటిలో ప్రతిబింబించిన వైనమిది.





పాతబస్తీలోని బహదూర్‌పురా సుధాకార్ మ్యూజియంలో పంద్రాగస్టు వేడుకల సందర్భంగా అతిపెద్ద జాతీయ జెండా మొబైల్ కారును రూపొందించారు.



బియ్యం గింజపై జాతీయ జెండా

చాంద్రాయణగుట్ట: పాతబస్తీ ఉప్పుగూడ అంబికానగర్‌కు చెందిన ఎంబీఏ విద్యార్థిని రామగిరి స్వారిక బియ్యం గింజపై సూక్ష్మ చిత్రాలు గీస్తూ తన ప్రతిభను చాటుకుంటోంది. రామగిరి శ్రీనివాసాచారి కుమార్తె అయిన స్వారిక కాచిగూడలోని భారత్ పీజీ ఉమెన్స్ కాలేజీలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఓ వైపు చదువు సాగిస్తూనే సూక్ష్మ చిత్రాలు గీస్తోంది. తాజాగా స్వారిక బియ్యం గింజపై 0.5 మిల్లీమీటర్ల సైజులో జాతీయ జెండా చిత్రాన్ని గీసి రంగులు అద్దారు. అంతే గాకుండా బియ్యం గింజపై 0.5 మి.మీ. సైజులో 26 అక్షరాల ఆంగ్ల అక్షరమాలను చిత్రీకరించింది. స్వారిక గీసిన సూక్ష్మచిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.



స్వారిక

ఇవీ వివరాలు	28	3850	3550	18000	700 పైగానే..	500	30 శాతం
	నగరంలో ఆర్టీసీ డిపోలు	ఆర్టీసీ బస్సులు	నిత్యం రోడ్డెక్కుతున్న బస్సులు	గ్రేటర్ జోన్‌లో డ్రైవర్లు, కండక్టర్లు	ఖాళీల సంఖ్య	డుమ్మా కొడుతున్న సిబ్బంది	డిపోలకే పరిమిత మవుతున్న బస్సులు



ప్రగతి చక్రం.. డిపోకే పరిమితం..!

- డ్రైవర్ల కొరతకు తోడు డుమ్మాలు
- అర్ధాంతరంగా రద్దవుతున్న సర్వీసులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

సిబ్బంది కొరత ఆర్టీసీని పట్టి పీడిస్తోంది. వందలాది డ్రైవర్, కండక్టర్ పోస్టుల ఖాళీలకు తోడు.. అకస్మాత్తుగా డుమ్మా కొట్టిన డ్రైవర్, కండక్టర్లతో అనేక బస్సులు డిపోలకు పరిమితమవుతున్నాయి. ప్రయాణికులు రోడ్ల మీద.. ఆర్టీసీ సిటీ బస్సులు డిపోలకే పరిమితం అవుతున్నాయి. – ఈనాడు, హైదరాబాద్

తగిన సిబ్బంది లేక...

నగరంలో 28 డిపోలున్నాయి. 3850 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. ఇందులో ప్రతిరోజూ రోడ్డెక్కుతున్న బస్సులు 3550 మాత్రమే. గత నాలుగైదేళ్లుగా ఆర్టీసీ ఉన్నతాధికారులు చెబుతున్న లెక్కలు. మిగతా సిబ్బంది పరిస్థితి ఎలా ఉన్నా.. ఆర్టీసీ ప్రగతి చక్రాలను ముందుకు నడిపించి డ్రైవరు, కండక్టర్ల కొరత ఆర్టీసీ హైదరాబాద్ జోన్‌ను వేధిస్తోంది. దీని ప్రభావం ప్రయాణికులపై పడుతోంది. కొరత ఎలా ఉన్నా.. నగరంలో కండక్టర్లు, డ్రైవర్లు 18వేల మంది ఉన్నారు. చాలా కాలంగా కొత్తవారిని తీసుకోని కారణంగా ఖాళీలు చాలా ఏర్పడ్డాయి. ఇలా ఖాళీగా ఉన్న డ్రైవర్, కండక్టర్ ఉద్యోగాలకు తోడు.. ప్రతి డిపోలో రోజుకు 20 మంది కండక్టర్లు, డ్రైవర్లు చొప్పున అకస్మాత్తుగా సెలవులు పెట్టేవారుంటారు. వివిధ కారణాలతో నగరంలోని సిటీ బస్సులు ఆర్టీసీ డిపోలకే పరిమితమవుతున్నాయి.

దూరప్రాంత బస్సులతో మరిన్ని ఖాళీలు..

నగరం నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే వారికోసం గ్రేటర్ జోన్ తరపున అధికారులు బస్సులు నడిపిస్తున్నారు. ఆలోచన బాగున్నా.. సిటీ బస్సు డ్రైవర్లనే ఇందుకు కేటాయించడం ఇప్పుడు ఇబ్బందిగా పరిణమిస్తోంది. జాతీయ స్థాయిలో ఆర్టీసీకి గుర్తింపు తెచ్చిన వజ్ర బస్సులను గ్రేటర్ జోన్ 40కిపైగా నడుపుతోంది. వీటివల్ల దాదాపు 100 మంది డ్రైవర్లు సిటీ బస్సుల్లో తిరగాల్సిన వారు బయటకు వెళ్లిపోయినట్టయ్యింది. అలాగే తిరుపతి, మైదకూరు, కుప్పం, అమలాపురం, రాజోలు, నర్సాపురం తదితర ప్రాంతాలకు 46 సూపర్‌లగ్జరీలు, 8 రాజధాని బస్సులను నడుపుతున్నారు. ఇలా 60 బస్సులకు ఇద్దరు డ్రైవర్లు చొప్పున 120 మంది ఉంటారు. మొత్తమ్మీద 220 మంది డ్రైవర్లు సిటీ బస్సులకు చెందినవారినే సర్దాల్సి వచ్చింది.

డిపోలకే పరిమితమైన బస్సులు..

ఇటీవల కాలంలో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమవుతున్నాయి. పగలంతా రోడ్లమీద ఉండాల్సిన బస్సులు దాదాపు 30 శాతం డిపోల్లో ఉండిపోతున్నాయి. 700లకుపైగా ఖాళీలతో పాటు అకస్మాత్తుగా మానేసిన డ్రైవర్, కండక్టర్లతో బస్సులు డిపోలను దాటి బయటకు రావడంలేదు. కొన్ని సామర్థ్యం లేక డిపోలకు పరిమితం అవుతుంటే.. మరికొన్ని డ్రైవరు, కండక్టర్లు లేక మూలన పడుతున్నాయి. నగర శివార్లలోని ఇంజినీరింగ్ కళాశాలలు ప్రారంభం, ముగిసిన సమయాల్లో బస్సులు లేక ఇబ్బంది పడుతున్నారు. నగరంలో వేలాడుతూ ప్రయాణికులు కనిపిస్తున్నా.. ఆర్టీసీ అటువైపు చూడడానికి సిబ్బంది కొరతతో సాహసించలేకపోతోంది.





దాటాలంటే ఎంత కష్టం | **దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతవాసులకు మెట్రో పనుల రూపంలో సరికొత్త కష్టమొచ్చి పడింది. ప్రధాన రహదారిని దాటేందుకు గతంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఉండేది. మెట్రో పనుల వల్ల దానిని తొలగించారు. ప్రస్తుతం డివైడర్లను ఎత్తైన గోడలతో నిర్మిస్తున్నారు. దాంతో ప్రధాన రహదారిని అటూఇటూ దాటాలంటే ఇలా అష్టకష్టాలైనా పడాలి.. లేదా కిలోమీటరు దూరమైనా తిరిగి రావాలి.**

తప్పుడు సిమ్‌లు... తప్పవు ఊచలు

(మొదటి పేజీ తరువాయి) సెంటర్‌లో ఎవరు విధులు నిర్వహిస్తున్నారో వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తారు. ఇటీవల సైబర్‌క్రైమ్ పోలీసులు ఇద్దరు నేరగాళ్లను పట్టుకుంటే ఒకరి వద్ద 268, మరొకరి వద్ద 560 సిమ్‌కార్డులు లభించాయి. ఇవన్నీ ప్రీ-యాక్టివేటెడ్ కార్డులే.. అంటే అంతకుముందు వేరే వ్యక్తుల పేరుమీద ఇవన్నీ తీసుకుని ఉంటారని పోలీసు అధికారులు తెలిపారు.

మా సిమ్‌కార్డులే అమ్ముడు పోవాలని...

స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు పెరుగుతుండడంతో సిమ్ కార్డులకు గిరాకీ పెరిగింది. ధ్రువీకరణ పత్రాలుంటేనే వాటిని వినియోగదారులకు ఇవ్వాలి. మొబైల్ నెట్‌వర్క్ సంస్థల మధ్య విపరీతమైన పోటీ ఏర్పడటంతో సిమ్ కార్డుల విక్రయాలను పెంచుకోవాలన్న లక్ష్యంతో సంచార విక్రయాలను మొదలు పెట్టారు. వీటికీ లక్ష్యాలు విధించడంతో మార్కెటింగ్ సిబ్బంది రోజుకు కనీసం వంద కార్డులైనా విక్రయించాలన్న ఉద్దేశంతో ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకున్నా ఇస్తున్నారు. వీటిని నేరగాళ్లు, ఉగ్రవాద సంస్థలు వినియోగిస్తున్నారంటూ కేంద్ర నిఘా సంస్థ హెచ్చరించడతో ధ్రువీకరణ పత్రాలు కచ్చితంగా కావాలంటూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయా కంపెనీలు ముందుగానే ఉపయోగంలో ఉన్నవి (ప్రీయాక్టివేటెడ్) అందిస్తున్నాయి. ఒక్క వినియోగదారుడు ఉంటే చాలు... సదరు వినియోగదారుడి పేరుమీద సిమ్ కార్డులు యాక్టివేట్ చేస్తున్నారు. అత్యవసరంగా సిమ్ కార్డు అవసరం ఉన్నవారు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోయినా సరే... వారికి వాటిని ఇచ్చేస్తున్నారు. అవి తక్షణం పని చేస్తున్నాయి. నేరాలకు పాల్పడే ముఠాలు, అంతరాష్ట్ర ముఠా సభ్యులు హైదరాబాద్, సైబరాబాద్ పరిధుల్లో నివాసముంటూ ప్రీయాక్టివేటెడ్ సిమ్ కార్డులను తీసుకుంటున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధుల్లో సంచలనం సృష్టించిన నేరాల్లో నిందితులు ప్రీయాక్టివేటెడ్ సిమ్‌కార్డులను వినియోగించారని పోలీసులు గుర్తించారు. పోలీసుల ఎదురు కాల్పుల్లో ఏడాది క్రితం మరణించిన గ్యాంగ్‌స్టర్ నయీం వద్ద 500కుపైగా కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

దేశభద్రతకు కచ్చితంగా ముప్పే...

-ఎం.మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్

ప్రీయాక్టివేటెడ్ సిమ్‌కార్డులు దేశభద్రతకు ముప్పుగా మారే ప్రమాదం ఉంది. మెట్రో నగరాలను లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు, ఉగ్రవాదులు విధ్వంసాలకు ప్రణాళిక రచిస్తున్నారు. వీరు ప్రీయాక్టివేటెడ్ సిమ్ కార్డులను ఎక్కువ మొత్తానికి కొంటున్నారు. దిల్లీ నగరంలో సైబర్ నేరగాళ్లు వందల సంఖ్యలో వీటిని వినియోగిస్తున్నారు. కొత్త మార్గదర్శకాల నేపథ్యంలో నిబంధనలు పాటించని వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టనున్నాం. ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో పాటు నేరగాళ్లకు సిమ్‌కార్డులు ఇచ్చిన కంపెనీలపైనా కేసులు నమోదు చేస్తాం.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి



లారీని డీకొట్టిన కారు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: శివారు రోడ్లపై రక్తపాతం ఆగడం లేదు. రెండు రోజుల క్రితం హిమాయత్‌సాగర్ రోడ్డులో చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఓ ఎస్సై, ట్రైనీ మహిళా కానిస్టేబుల్ మృతి చెందిన విషయం మరవక ముందే.. తాజాగా సోమవారం ఉదయం ఓ కారు వేగంగా లారీని ఢీకొట్టడంతో కారులోని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మైలార్‌దేవ్‌పల్లి ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పంజాగుట్ట శ్రీనగర్ కాలనీకి చెందిన మారనికుమార్‌రెడ్డి (24) సోమవారం ఉదయం 6గంటలకు చాంద్రాయణగుట్ట నుంచి దుర్గానగర్ మీదుగా ఇంటికి వెళ్తున్నాడు. దుర్గానగర్ ఆరాంఘర్ మధ్యలో సాయిబాబానగర్ సమీపంలో కారును వేగంగా నడుపుతూ ఎడమవైపున వాహనాన్ని దాటే ప్రయత్నం చేశాడు. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో కారు లారీ కిందికి పోయి నుజ్జునుజ్జయ్యింది. కారు నడుపుతున్న మారనికుమార్‌రెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పబ్బుకొొచ్చిన వ్యక్తిపై దాడి

కంటి వద్ద గాయం ● నిర్వాహకులు, బౌన్సర్లపై కేసు

జూబ్లీహిల్స్: పబ్బుకొచ్చిన ఓ వ్యక్తిపై పబ్బు యజమానులతోపాటు బౌన్సర్లు దాడికి పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిదిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నెం.11లో నివసించే సంతోష్ అనే వ్యాపారి తన స్నేహితులతో కలిసి శనివారం జూబ్లీహిల్స్ రోడ్ నెం.36లోని టిక్కీషా పబ్‌కు వెళ్లారు. పబ్బులో ఉండగా సంతోష్ చేతిలో ఉన్న గ్లాసు బౌన్సర్లకు తగిలింది. దీంతో బౌన్సర్లకు, సంతోష్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. రాత్రి 11.45 గంటల ప్రాంతంలో సంతోష్ పబ్ నుంచి తిరిగి వెళ్తున్న సమయంలో బౌన్సర్లు ఆయనను నిలువరించి దాడికి పాల్పడ్డారు. కంటి సమీపంలో గాయమైన సంతోష్ సోమవారం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలో సంతోష్ వద్ద పోలీసులు ఒక తుపాకిని గుర్తించారు. లైసెన్స్ ఉన్న తుపాకి కావడం, దానిని సంఘటన జరిగిన సమయంలో ఉపయోగించకపోడంతో వదిలివేశారు. కాగా సంతోష్‌తో వచ్చిన ఒక యువతి చేయి పట్టుకొని లాగడంతో వివాదం తలెత్తినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.

యజమాని నిర్లక్ష్యంతో యువకుడు బలి



సరోజ్‌కుమార్ రాయి అలియాస్ రాజీవ్‌కుమార్

గోషామహల్: ఎలాంటి అనుమతులు లేవు. గతంలో కూడా పోలీసులు దాడి చేశారు. అయినా అక్రమంగా కల్తీ మిస్రీ పరిశ్రమను కొనసాగిస్తున్నారు. ఫలితంగా ఓ యువకుడు బలయ్యాడు. ఈ దుర్ఘటన షాయినాయత్‌గంజ్ ఠాణా పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజార్‌కు చెందిన ప్రముఖ వ్యాపారికి సమీప బంధువు అయిన సంజూ(24) జుమ్మేరాత్ బజార్‌లో మిస్రీ తయారీ పరిశ్రమను అక్రమంగా నిర్వహిస్తున్నాడు. నెలన్నర కిత్రం ఈ పరిశ్రమపై పోలీసులు దాడి జరిపి అక్రమంగా నిర్వహిస్తున్న కల్తీ మిస్రీ తయారీ గుట్టు రట్టు చేసిన విషయం తెలిసిందే. అయినప్పటికీ యథాతథంగా కొనసాగుతూ వస్తోన్న ఈ పరిశ్రమలో సోమవారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ఇందులో పని చేస్తున్న బిహార్‌కు చెందిన సరోజ్‌కుమార్ రాయ్ అలియాస్ రాజీవ్‌కుమార్(20) విద్యుత్ తీగలకు బలై నిండు ప్రాణాన్ని కోల్పోయాడు. పరిశ్రమ పై అంతస్తులోని రేకులపై ఉన్న కర్ర ముక్కలను తొలగించేందుకు పైకి ఎక్కిన అతను ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి మృత్యువాతపడ్డాడు. షాయినాయత్‌గంజ్ పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

సెప్టెంబరు 15లోపు పూర్తి చేస్తాం

● 'ఈనాడు' కథనానికి స్పందించిన జలమండలి

ఈనాడు, హైదరాబాద్: మల్కాజిగిరిలో పనుల్ని సెప్టెంబరు 15లోపు పూర్తి చేయాల్సిందిగా సంబంధిత గుత్తేదారును ఆదేశించినట్లు జలమండలి ఓ ప్రకటనలో తెలిపింది. సోమవారం 'ఈనాడు'లో 'అధికారుల మాట వినని గుత్తేదారులు' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. సకాలంలో పనుల్ని పూర్తి చేయని కాంట్రాక్టర్లకు రూ.18 వేలు జరిమానా విధించినట్లు వివరించారు. పెండింగ్‌లో ఉన్న పనుల్ని వీలైనంత తొందరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

రూ.19 లక్షల బంగ్లాదేశ్ సిగరెట్లు స్వాధీనం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతా, దిల్లీ మీదుగా నిషేధించిన సిగరెట్లను రైళ్లలో నగరానికి తెచ్చిన ఇద్దరిని పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. రూ.19 లక్షల విలువైన 48 వేల విదేశీ సిగరెట్లను, రూ.19 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ లింబారెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాజావెంకట్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. చార్మినార్ నూర్‌ఖాన్‌బజార్‌కు చెందిన అజాజ్ ఆలీ(42) కూలీ పనిచేస్తున్నాడు. డబీర్‌పురా మీరాలంమండికి చెందిన ఆలీరాజా(48) ఆటోడ్రైవర్. బేగంబజార్ వాసి మహ్మద్ హసనుద్దీన్ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. హసనుద్దీన్ బంగ్లాదేశ్‌లో తయారైన సిగరెట్లను నగరానికి తీసుకొచ్చి పాన్ దుకాణాల్లో అమ్ముతున్నాడు. రైల్వేస్టేషన్‌కు సిగరెట్ల పార్సిల్ రాగానే అజాజ్‌ఆలీ, ఆలీరాజాను పంపించి తెప్పించుకుంటాడు. పార్సిల్ తెచ్చేందుకు వారిద్దరు వెళ్లగా పోలీసులు అరెస్టు చేశారు. ఆటోను స్వాధీనం చేసుకున్నారు. హసనుద్దీన్ పరారీలో ఉన్నాడు.



గుర్రపు డెక్క, చెత్త తొలగించడంతో కళకళలాడుతున్న నెక్నాంపూర్ చెరువు

జలసిరులకు కావాలి స్వాతంత్ర్యం

- చెరువులన్నీ చెత్త చెదారం, కాలుష్య మయం
- సొసైటీగా ఏర్పడి పరిరక్షణకు కదిలిన యువతరం
- నెక్నాంపూర్ చెరువు పరిసర కాలనీవాసులు ఆదర్శం

ఈనాడు, హైదరాబాద్

బానిస సంకెళ్ల నుంచి ఏడు దశాబ్దాల క్రితం మనకు స్వాతంత్రం వచ్చింది. హాయిగా స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ.. బాధ్యతగా ఉండాల్సింది పోయి.. చుట్టూ ఉన్న చెరువులను చెత్త, భవన నిర్మాణాల వ్యర్థాలతో సమాధి చేస్తున్నాం. నగరంలోని చాలా చెరువుల్ని కాలుష్య కాసారాలుగా మార్చేశాం. ఇప్పుడు స్వాతంత్రం కావాల్సింది అలాంటి చెరువులకే అంటోంది ఈతరం. ఇదే ఆలోచనతో చెత్తచెదారం, కాలుష్యం నుంచి విముక్తి కల్పించాలని కొందరు యువకులు నడుం బిగించారు. అక్కడ పక్షులు స్వేచ్ఛగా సంచరించేలా.. మనుషులు ఆహ్లాదంగా గడిపేలా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. మిగతా వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

తారామతి బారాదరి చారిత్రక కట్టడం సమీపంలో ఇబ్రహీంబాగ్, నెక్నాంపూర్ చెరువులున్నాయి. వీటికి 440 ఏళ్ల చరిత్ర ఉంది. కొన్ని తరాలకు ఇవి తాగు, సాగునీటి అవసరాలు తీర్చాయి. ఇప్పుడు వాటి పరిస్థితి చూస్తే ప్లాస్టిక్ వ్యర్థాలు, ఆక్రమణలతో అంతరించే దశలో ఉన్నాయి. ఇప్పటికైనా మేల్కోకపోతే ముందు తరాల వారికి చెరువు ఆనవాళ్లు కూడా కనపడకపోయే ప్రమాదాన్ని గ్రహించిన కొందరు యువకులు పెద్దల తోడ్పాటుతో సహకార సంఘంగా ఏర్పడ్డారు. 'నెక్నాంపూర్ చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి సహకార సంఘం'గా ఏర్పడి స్థానికులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం చేస్తూ చెరువును కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

పరుగు పరుగునా..

జూన్ 4న 5 కి.మీ. పరుగుతో వీరి కార్యాచరణ మొదలైంది. చుట్టు పక్కల అపార్ట్‌మెంట్‌వాసులు, కళాశాల విద్యార్థులు, ఐటీ ఉద్యోగులందరూ కలిసి ఈ పరుగులో పాల్గొని చెరువులను కాపాడుకోవాల్సిన అవసరంపై అందరిలో అవగాహన కల్పించారు. 500 మంది వస్తారనుకుంటే దాదాపు వెయ్యి మంది వరకు ఇందులో పాల్గొన్నారు. అందరిదీ ఇదే ఆలోచనే అయినా ఇన్నాళ్లు ఒక వేదిక కోసం వేచిచూశామన్నట్లుగా స్థానికులు తరలి వచ్చారు.

నినదించి..

చెరువులను సంరక్షించుకోవాలంటే ముందుగా అక్కడ స్థానికులకు వీటిపై ఒక బంధం ఏర్పడితే తప్ప ఇది తమది అన్న భావన కల్గదు. అందుకే నినాదాల పోటీ పెట్టారు. వారి పిల్లలతో చెరువుల సంరక్షణకు సంబంధించిన నినాదాలు రాయించి ఇది తమ చెరువు కాపాడుకోవాలనే స్ఫూర్తిని వారిలో సొసైటీ కల్గించింది.

లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు..

స్వాతంత్ర దినోత్సవం రోజు మొదలెట్టి గాంధీ జయంతి నాటికి చెరువులను ప్లాస్టిక్ వ్యర్థాలు, కాలుష్యం నుంచి బయటపడేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అందుకు అనుగుణంగా ఈ వారాంతం శనివారం రోజు కొందరి సభ్యుల బృందం చెరువును శుభ్రం చేసే పనిని ప్రారంభించింది. ప్రతి రెండువారాలకు ఒకసారి పెద్ద ఎత్తున స్వచ్ఛభారత్ చేపట్టి చెరువుల పరిసరాలను ఆహ్లాదంగా తీర్చిదిద్దనున్నారు.



చెరువు పరిసరాలను బాగు చేస్తున్న సంఘం సభ్యులు



చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి సహకార సంఘం సభ్యులు

రన్నర్స్ క్లబ్‌తో..

'ఎంతో చరిత్ర ఉన్న చెరువులు సిటీలో ఉన్నాయి. నెక్నాంపూర్, ఇబ్రహీంబాగ్ కూడా అలాంటివే. కానీ తాము 5 కె రన్ నిర్వహించే వరకు అక్కడున్నవారికి చాలామందికి తెలియదు. తెలిశాక వాటిని సంరక్షించుకోవాలనే తపన వారిలో కన్పించింది. 90 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంటుంది. 3 ఎకరాలు బండ్ ఉంటుంది. చెరువు చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసుకుని.. ట్రాక్ నిర్మాణంతో నడక, వ్యాహ్యాళికి ఉపయోగించుకునేలా తీర్చిదిద్దగల్గితే సంరక్షణ తేలికవుతుంది. అందుకే ఒక రన్నర్స్ క్లబ్ ఏర్పాటు చేశాము. ఇటువంటి చర్యలు ఒక్కోటిగా చేపడుతున్నాం.'

– సునీల్ చక్రవర్తి, అధ్యక్షుడు, నెక్నాంపూర్ చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి సహకార సంఘం

మక్కాకు తొలి బృందం

452 మంది యాత్రికులతో బయలుదేరిన విమానం

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: ముస్లింల పవిత్ర పుణ్యక్షేత్రం మక్కాను దర్శించుకోవడానికి సోమవారం తెల్లవారుజామున తొలి విమానంలో దాదాపు 452 మంది హజ్ యాత్రికులు బయలుదేరి వెళ్లారు. ఈ ఏడాది తొలిసారిగా హజ్‌యాత్రికులతో వెళుతున్న సౌదీ అరేబియా ఎయిర్‌లైన్స్ విమానంను శంషాబాద్ విమానాశ్రయం హజ్ టర్మినల్ వద్ద ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, గ్రేటర్ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్‌పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ.. పేద ముస్లిం కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత తెరాస ప్రభుత్వానికే దక్కిందని అన్నారు.

హజ్‌యాత్రకు రూ.3 కోట్లతో ఏర్పాట్లు

నాంపల్లి: హజ్‌యాత్ర-2017కు ప్రభుత్వం రూ.3 కోట్ల వ్యయంతో ప్రత్యేకంగా భారీ ఏర్పాట్లు చేపట్టిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ పేర్కొన్నారు. నాంపల్లి హజ్‌హౌజ్ నుంచి బయలుదేరి వెళ్తున్న తొలి బ్యాచ్ యాత్రికుల బస్సును శనివారం రాత్రి మహమూద్‌అలీ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఆయన ప్రసంగిస్తూ అవరోధాలు తలెత్తకుండా ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేపడుతోందని అన్నారు. ఈనెల 22న చివరి బృందం వెళ్లనుందన్నారు. ఎస్.ఎ.షుకూర్ సయ్యద్ ఒమర్‌జలీల్ తదితరులుపాల్గొన్నారు.



హజ్ యాత్రికుల విమానానికి జెండా ఊపుతున్న ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ తదితరులు



సమంత రాకతో సందడి..

చింతల కుంట ఎల్‌పీటీ మార్కెట్ సందర్శన

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: ఎల్బీనగర్ సమీపంలోని చింతలకుంట వద్ద ఉన్న ఎల్‌పీటీ మార్కెట్‌ను ప్రముఖ సినీనటి, తెలంగాణ రాష్ట్ర చేనేత వస్త్ర బ్రాండ్ అంబాసిడర్ సమంత సోమవారం సందర్శించారు. ఆమె రాకతో సందడి వాతావరణం నెలకొంది. మార్కెట్ సముదాయంలోని దుకాణాలను సందర్శించిన ఆమె చేనేత వస్త్రాలను పరిశీలించారు. అఖిలభారత హ్యాండ్లూమ్ బోర్డు డైరెక్టర్, గజం గోవర్ధన్ చేనేత వస్త్రాల ప్రాముఖ్యతను ఆమెకు వివరించారు. సమంతను చూసేందుకు తరలివచ్చిన జనంతో మార్కెట్ కిటకిటలాడింది. ఎల్‌పీటీ మార్కెట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అశోక్, ఉపాధ్యక్షుడు ఆర్.దామోదర్, ప్రతినిధులు జె.జగన్, వి.అశోక్, పాండురంగం తదితరులున్నారు.



అలరించిన కూచిపూడి నృత్యం

అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు

మాదాపూర్ న్యూస్‌టుడే: కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం సాయంత్రం శిల్పారామంలో ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా అలరించాయి. బెంగళూరు నుంచి వచ్చిన యశ్వసి శివరామన్ చూడముచ్చటైన కథక్ నృత్యంతో కనువిందు చేసింది. వినసొంపైన సంగీతానికి చక్కటి నృత్యాభియనంతో నృత్యం చేసిన తీరు కళాభిమానులను ఆకట్టుకుంది. అనంతరం నృత్యోదయ కూచిపూడి డ్యాన్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు కూచిపూడి నృత్యాంశాలతో చూపరులను మంత్రముగ్ధులను చేశారు.



చిత్రాలను తిలకిస్తున్న మ్యూజియం అధికారులు.. సందర్శకులు

స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపే చిత్రాల ప్రదర్శన

ఈ నెల 21వ తేదీ వరకు కొనసాగింపు

చార్మినార్, న్యూస్‌టుడే: సాలార్ జంగ్ మ్యూజియంలో 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన సందర్శకులకు స్వాతంత్ర సంగ్రామ స్ఫూర్తిని కల్పిస్తుంది. 1857 నుంచి 1947 వరకు భారత్ సాగించిన స్వాతంత్ర పోరాట ఘట్టాలు ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. భారత్ స్వాతంత్ర తొలి సంగ్రామ ఘట్టాలతోపాటు స్వాతంత్రమే నా జన్మహక్కు అంటూ.. ఎంతో మంది స్వాతంత్ర సమరయోధులు సాగించిన పోరాటాల ఘట్టాల చిత్రాలు ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. 1857లో సిపాయిల తిరుగుబాటు.. టిప్పు సుల్తాన్ సైనిక బలగాలు బ్రిటీష్ సైన్యంతో వీరోచితంగా పోరాటం సాగించిన చిత్రాలు.. మహాత్మాగాంధీ అహింసా మార్గంలో స్వాతంత్ర్య పోరాటాన్ని ఉద్ధృతంగా కొనసాగించిన తీరు.. ఝాన్సీ లక్ష్మిబాయి తదితర భారతీయ నారీమణులు సైతం వీరోచితంగా స్వాతంత్ర సంగ్రామం సాగించిన తీరును కళ్లకు కట్టే పలు చిత్రాలు ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. స్వాతంత్ర పోరాటాల ఘట్టాలను విశదీకరించే 80 కళాఖండాలు ప్రదర్శనలో ఉన్నాయి. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని రగిలించే ఈ ప్రత్యేక ప్రదర్శన ఈనెల 21వ తేదీ వరకు కొనసాగుతుందని మ్యూజియం అధికారులు వివరించారు.

రాజేంద్రనగర్

శంషాబాద్ మార్కెట్‌లో కూరగాయల ధరలు

శంషాబాద్: శంషాబాద్ మార్కెట్‌లో సోమవారం నాటి కూరగాయల ధరలు కిలో.. టమాట 50, ఆలుగడ్డ 30, బెండకాయ 40, దొండకాయ 35, కాకరకాయ 40, దోసకాయ 25, పొట్లకాయ 25, సొరకాయ 25, వంకాయ 40, చిక్కుడుగాయ 40, గోకరకాయ 30, క్యాప్సికం 35, క్యారెట్ 30, కీరా 30, ముల్లంగి 30, క్యాలీఫ్లవర్ 30, చేమగడ్డ 35, కందగడ్డ 30, పచ్చిమిర్చి 45, ఉల్లిగడ్డలు 35, ముల్లక్కాడ 25, బీర్నీసు 30, బీరకాయ 40.

మణిహారం.. వ్యర్థాలకు నిలయం

చెత్తకుప్పలతో నిండిపోయిన కాముని చెరువు





శంషాబాద్ అవుటర్ సర్వీస్ రోడ్డుపై వ్యర్థాలు

డంపింగ్ కేంద్రాలుగా అవుటర్ సర్వీస్ రోడ్లు

అంతర్గత దారులు, చెరువులు.. దేన్నీ వదలడం లేదు

తలనొప్పిగా మారిన స్థలాల కేటాయింపు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: శంషాబాద్ పరిధిలోని బాహ్యవలయ సర్వీస్ రహదారులు, అంతర్గత రోడ్లు, చెరువులు, కుంటలు చెత్త డంపింగ్ కేంద్రాలుగా మారాయి. శంషాబాద్ విమానాశ్రయం రావడంతో గత పదేళ్లలో ఇక్కడికి వలసలు పెరగడంతో పదుల సంఖ్యలో కొత్త కాలనీలు వెలిశాయి. మండల జనాభా లక్షరే చేరింది. నిత్యం టన్నుల కొద్ది వెలువడుతున్న మాంసం వ్యర్థాలు, ప్లాస్టిక్, చెత్త చెదారాన్ని పారబోయడానికి ఇక్కడెక్కడా డంపింగ్ కేంద్రాలు లేవు. పారిశుద్ధ్య కార్మికులు సేకరిస్తున్న చెత్తను ఎక్కడ వేయాలో తెలియక తంటాలు పడుతున్నారు. విధి లేని పరిస్థితులో ప్లాస్టిక్ కవర్లతో కూడిన చెత్తకు రహదారుల పక్కన వేసి నిప్పు పెడుతున్నారు. విషవాయువులతో కూడిన దట్టమైన పొగ జనావాసాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. మరికొందరు అదును చూసి అవుటర్ సర్వీస్ రోడ్లు, జాతీయ రహదారి, చెరువులు, కుంటల్లో పారబోస్తున్నారు. ఇదే అవకాశంగా మాంసం దుకాణాల యజమానులు సైతం జంతు వ్యర్థాలను రాత్రిపూట సర్వీస్ రోడ్ల పక్కనే వేస్తున్నారు. తెల్లారేసరికి రోడ్ల పక్కన, చెరువుల వద్ద గుట్టలుగా చెత్త పేరుకుపోయి డంపింగ్ కేంద్రాలను తలపిస్తున్నాయి.

ముక్కుమూసుకోవాల్సిందే..

మహానగరానికి మణిహారంగా నిర్మించిన బాహ్యవలయ రహదారి సర్వీస్ రోడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. శంషాబాద్ పరిధిలోని రాళ్లగూడ సమీపంలో ఇరువైపుల ఉన్న ఔటర్ సర్వీస్ రోడ్లు జంతు మాంస వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, చెత్త కుప్పలతో నిండిపోతున్నాయి. వేల కోట్లు వెచ్చించి నిర్మించిన సర్వీస్ రోడ్లు చెత్త కుప్పలకు నిలయంగా మారడంతో విమానాశ్రయానికి వచ్చే వేలాది మంది దేశ, విదేశాల ప్రయాణికులు ముక్కుమూసుకుంటున్నారు.

డంపింగ్ కేంద్రాలకు స్థలాల కేటాయింపు.. సవాలే..

చెత్త డంపింగ్ స్థలాలు కేటాయించే అంశం అధికారులకు తలనొప్పిగా మారింది. దశాబ్దాకాలంగా స్థలాన్ని కేటాయించాలంటూ జిల్లా పాలనాధికారులకు శంషాబాద్‌వాసులు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. ఈ దీర్ఘకాలిక సమస్యకు చెక్ పెట్టడానికి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు ఎట్టకేలకు ఇటీవలే శంకరాపూర్ రెవెన్యూ సంఖ్య 42లో దాదాపు 10 ఎకరాల స్థలాన్ని ఇవ్వడానికి రంగం సిద్ధం చేశారు. అయితే శంషాబాద్‌లోని చెత్తను శంకరాపూర్ గ్రామంలో పారబోస్తే శివారు వ్యవసాయ భూములు, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని శంకరాపూర్, హమీదుల్లానగర్, చిన్నగోల్కొండ, గొల్లపల్లి గ్రామాల సర్పంచులు ఎమ్మెల్యేకు విన్నవించడంతో చెత్త డంపింగ్ స్థలం కేటాయింపు సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

కాలుష్యపు కోరల్లో కామునిచెరువు

శంషాబాద్ నడిబొడ్డున జాతీయ రహదారికి ఆనుకొని దాదాపు 50 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో విస్తరించిన కాముని చెరువు మాంస వ్యర్థాలు, ప్లాస్టిక్, చెత్త కుప్పలతో నిండిపోయింది. ఒకప్పుడు వేల ఎకరాలకు సాగునీరు, శివారు గ్రామాలకు తాగు నీటిని అందించిన కాముని చెరువు ఇప్పుడు కాలుష్య కాసారంగా మారింది. చెత్త డంపింగ్ కేంద్రంగా మారిన కాముని చెరువును పునరుద్ధరించడానికి మిషన్ కాకతీయ పథకంలో ప్రభుత్వం రూ.7లక్షలు వెచ్చించింది. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయ లోపం కారణంగా కట్ట పనులను తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకొన్నారు. కనీసం చెరువులోని కిలో చెత్త కూడా తొలగించలేకపోయారు. చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాల్సిన నీటి పారుదల శాఖ అధికారులు తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో నీటితో కళకళలాడాల్సిన చెరువు కాలుష్యంతో దుర్గంధం వెదజల్లుతుంది.

త్వరలోనే అన్ని గ్రామాలకు చెత్త డంపింగ్ స్థలాలు



–సురేష్‌కుమార్, తహసీల్దార్ శంషాబాద్

శంషాబాద్ మండలంలోని అన్ని గ్రామాలకు చెత్త డంపింగ్, శ్మశాన వాటిక స్థలాలను కేటాయించడానికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు శంషాబాద్ తహసీల్దార్ జి.సురేష్‌కుమార్ తెలిపారు. రెండు మూడు గ్రామాలకు సరిహద్దుల్లో చెత్త డంపింగ్ కేంద్రాలను ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఏ గ్రామం నుంచి వెలువడిన చెత్తను అదే గ్రామంలోని ప్రభుత్వ భూమిలో పారబోసే విధంగా చెత్త డంపింగ్ కేంద్రాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. గండిపేట్‌లో చెత్తతో ఎరువులు తయారు చేస్తున్న ప్రాజెక్టును పరిశీలించాలని సర్పంచులకు సూచించినా స్పందన లేదన్నారు. తడి, పొడి చెత్తను ఎన్ని టన్నులైనా గండిపేట్ ప్రాజెక్టుకు తరలిస్తే.. అక్కడ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తహసీల్దార్ వివరించారు.

'విప్రో బాధితులకు అండగా నిలుస్తాం'



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో మాట్లాడుతున్న వట్టినాగులపల్లివాసులు

మణికొండ, న్యూస్‌టుడే: విప్రో సంస్థ ఏర్పాటు సమయంలో భూములు కోల్పోయిన వట్టినాగులపల్లి రైతులకు పరిహారం అందేలా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం వట్టినాగులపల్లి గ్రామ రైతులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దశాబ్దకాలంగా తమ భూముల పరిహారం ఇప్పించాలని పదేపదే కోరుతున్నామని వెల్లడించారు. ఈ విషయమై అధికారులు దృష్టి సారించేలా చొరవ చూపుతామని ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. ఎంపీపీ తలారి మల్లేష్, ఎంపీటీసీ వెంకటేష్, నాగేష్‌యాదవ్, ప్రదీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

భాజపాను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: భాజపాను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి బూత్ కమిటీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆ పార్టీ తెలంగాణ విమోచన కమిటీ ఛైర్మన్ శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ భాజపా అధ్యక్షులు జనార్ధన్ నేతృత్వంలో డివిజన్ కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి మూడు నెలలకు ఒకసారి డివిజన్ కార్యకర్తల సమావేశం నిర్వహించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బూత్‌కమిటీల సభ్యులు కృషి చేయాలని అన్నారు. పథకాలు ప్రజల్లోకి వెళ్లినప్పుడే పార్టీపై విశ్వాసం పెరుగుతుందని అన్నారు. పథకాలు అమలవుతున్నా అవి కేంద్ర ప్రభుత్వ పథకాలని ప్రజలు తెలియడంలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలును, వాటిని వినియోగించే విధానాన్ని ఇంటింటికి తిరిగి వివరించాలని అన్నారు. నాయకులు ప్రేమ్‌రాజ్‌యాదవ్, జి.రాంచంద్రారెడ్డి, వై.శ్రీధర్, అడికెరాజు, కొమ్రయ్య, జె.రవి, ఆర్.భాస్కర్, పి.మల్లేష్‌యాదవ్, మురళీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగు ప్రవాహాన్ని అడ్డుకోండి



అల్కాపూర్ కాలనీ రోడ్డుపై మురుగు

మణికొండ, న్యూస్‌టుడే: నెక్నాంపూర్ అమ్మవారి ఆలయానికి సమీపంలోని రహదారుల్లో మురుగు ప్రవాహాన్ని నివారించాలని పాదచారులు కోరుతున్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి అమ్మవారి గుడి మీదుగా అల్కాపూర్ రహదారికి వెళ్లే దారిలో సమీప అపార్ట్‌మెంట్ ముందు నుంచి మురుగును వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డుపైకి మురుగు చేరకుండా పంచాయతీ కార్యాలయ సిబ్బంది చర్యలు చేపట్టాలని గ్రామస్థులు పద్మారావు కోరుతున్నారు. సరైన వసతులు లేకుండా.. బహుళ అంతస్తుల సముదాయాలు నిర్మించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

చిన్న అనంతగిరి శివాలయంలో శ్రావణ పూజలు



పూజల్లో పాల్గొన్న ఆలయకమిటీ సభ్యులు

రాజేంద్రనగర్: శ్రావణమాసంలో ఆఖరి సోమవారం పురస్కరించుకొని చిన్నఅనంతగిరి శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉదయం సుప్రభాతసేవ, గణపతి, ఆంజనేయ స్వామి, పరమశివుని రుద్రాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మోండ్ర నర్సింహ్మా, ఎస్.కృష్ణ, పి.అశోక్, బి.మల్లారెడ్డి, కె.హరినాథ్, కె.సుభాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ

నార్సింగి: స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కిస్మత్‌పూర్ భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. మూడు రోజులుగా జరుగుతున్న వాలీబాల్, కబడ్డీ క్రీడలలో వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొంటున్నారు. సోమవారం ఎంపీపీ తలారి మల్లేష్ క్రీడాపోటీలను తిలకించారు. గ్రామాలలో క్రీడలను ప్రోత్సహించడానికి యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు తోడ్పడాలన్నారు. మంగళవారం ముగింపు కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేస్తారని ఎంపీటీసీ సురేశ్‌గౌడ్, భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు నర్సింహాగౌడ్‌లు తెలిపారు. ఎంపీటీసీలు మహేందర్‌గౌడ్, రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: యువకుడు అదృశ్యమైనా సంఘటన సోమవారం మండల పరిధిలో చోటు చేసుకొంది. ఆర్జీఐఏ ఠాణా అడ్మిన్ ఎస్సై రమేష్‌నాయక్ కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన అల్ఫాస్ మంచూరి(23) అనంతపురంలో ఓ ప్రైవేట్ కంపనీలో పని చేస్తున్నాడు. పహాడీషరీఫ్ జల్‌పల్లిలో ఉంటున్న అతని బావ నతీన్ వద్దకు బయలుదేరాడు. సోమవారం తెల్లవారు జామున 3.30గంటలకు గగన్‌పహాడ్ బస్టాప్‌లో దిగాడు. అతని వద్ద చరవాణి లేదు. ఇతరుల చరవాణితో గగన్‌పహాడ్ బస్టాప్ వద్ద ఉన్నట్లు బావకు సమాచారం అందించాడు. వెంటనే బైక్‌పై నతీన్ గగన్‌పహాడ్‌కు వచ్చే లోపు కనిపించకుండా పోయాడు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. నతీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజేంద్రనగర్



గోపికల వేషధారణలో బాలిక సందడి

తారంగం.. తారంగం..





రామకృష్ణ విద్యాలయంలో ఉట్టి కార్యక్రమంలో చిన్నారులు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే:

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్కిల్లోని ప్రైవేటు పాఠశాలల్లో వేడుకల సందడి అధికంగా కనిపించింది. ఆయా బస్తీలలోని చిన్నారులంతా కృష్ణుడు, గోపికల వేషధారణతో సందడి చేస్తూ పాఠశాలలకు వెళ్లడం కనిపించింది. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురంలోని సాయిగ్రామర్ పాఠశాలలో ప్రత్యేక సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీలక్ష్మీ, కరస్పాండెంట్ ఏపీ చారి నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో సందడి చేశారు. పాటలకు అనుకూలంగా నృత్యాలు చేశారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. మధు బన్‌కాలనీలోని రామకృష్ణ విద్యాలయంలో విద్యార్థులు ఉట్టికొట్టారు. పలువురు ఉట్టికొడుతుండగా నీళ్లు పోస్తూ సందడిగా గడిపారు. పాఠశాల కరస్పాండెంట్ బొల్లశ్రీనివాస్ పాల్గొన్నారు. అత్తాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో వేడకల్లో డీన్ అర్చనాసురేష్ పాల్గొన్నారు.

శంషాబాద్ గ్రామీణ: పాలమాకుల చైతన్య టెక్నో పాఠశాలలో సోమవారం జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు ఉల్లాసంగా ఉట్లు కొట్టారు.పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్, డీసీఎమ్మెస్ చైర్మన్ కె.శ్రావణ్‌గౌడ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న విద్యార్థులు

మణికొండ: శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని మణికొండ పవిత్ర ఇంటర్నేషనల్ పాఠశాలలో వేడుకలు వైభవంగా జరిగాయి. చిన్నారులను గోపికలుగా, శ్రీకృష్ణులుగా అందంగా అలంకరించారు. గోకులంలో శ్రీకృష్ణుడి లీలలు తెలిపే దృశ్యరూపకంలో చిన్నారులు సందడి చేశారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టేందుకు చిన్నారులు పోటీపడ్డారు. విద్యాసంస్థల ఛైర్మన్ వై. వెంకటేష్, ప్రిన్సిపల్ శ్రీవాణి తదితరులున్నారు.

- ఖానాపూర్‌లోని విద్యావికాస్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడి వేషధారణతో ఉట్టికొట్టే పోటీల్లో ఉత్సాహంగా పాలొన్నారు.


నార్సింగి: గండిపేట మండలంలోని వివిధ గ్రామాలలో కృష్ణాష్టమిని పురస్కరించుకొని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉట్లుకొట్టే కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. మంచిరేవుల శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో సహస్రకలశాభిషేకం, అర్చనలు, హారతి నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ, ఉట్లు కొట్టే కార్యక్రమాలు జరిగాయి. బండ్లగూడజ మహంకాళమ్మ ఆలయం వద్ద ఉట్లుకొట్టే కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. కిస్మత్‌పూర్ శ్రీక్రిష్ణ ఆలయం వద్ద పూజలు చేసి ఉట్లుకొట్టారు. నాయకులు సురేశ్‌గౌడ్, శేఖర్, సదానంద్, వీరాస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నార్సింగి, హైదర్షాకోట్, పీరంచెరువు, గండిపేట గ్రామాల్లో కూడా వేడుకలు జరిగాయి.



బండ్లగూడ మహంకాళమ్మ ఆలయం వద్ద ఉట్టి కొడుతున్న స్థానికులు

బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడిగా చిరంజీవి

నగరంలోని వివిధ పాఠశాలలకు ఇప్పటికీ సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ముఖ్యంగా పాతబస్తీలో ఎక్కువగా ఈ పరిస్థితి కనిపిస్తోంది. వీటిపై దృష్టిసారించి సొంత గూడు సమకూర్చడం ద్వారా చిన్నారులకు సాంత్వన కలిగించొచ్చు. ఇకపోతే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నిధుల నుంచి రూ.కోటి చొప్పున సమకూరే అవకాశముండడంతో త్వరలో పలు పాఠశాలలకు మరిన్ని సదుపాయాలు రానున్నాయి.

కాలుష్యాన్ని తరిమికొట్టాలి



హైదరాబాద్‌లో అన్నీ దొరుకుతాయి.. స్వచ్ఛమైన గాలి తప్ప అంటున్నారు పర్యావరణవేత్తలు. అవును మనం అప్రమత్తం కాకపోతే ఇదే నిజమవుతుంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశిత పరిమితుల ప్రకారం ఘనపు మీటరు గాలిలో సూక్ష్మ ధూళి కణాల(పీఎం 10) వార్షిక సగటు 60 మైక్రోగ్రాముల్ని మించరాదు. అది దాటితే ఆ ప్రాంతంలో గాలి పూర్తిస్థాయిలో స్వచ్ఛమైనది కాదు. గతయేడాది 21 చోట్ల పరిశీలిస్తే కేబీఆర్ ఉద్యావనవనం వద్ద తప్ప మిగతాచోట్ల పరిస్థితి చేయిదాటిపోయింది.

ఏం చేయాలి..!

- నగరంలో వెలువడే కాలుష్యంలో 70 శాతం వాటా వాహనాలదే. దీనికి అడ్డుకట్ట వేసేందుకు సుప్రీం కోర్టు నియమించిన బూరేలాల్ కమిటీ సూచనలను ప్రభుత్వం పక్కాగా అమలు చేయాలి.
- నగరంలో 95 శాతానికి పైగా పెట్రోల్, డీజిల్ వాహనాలే. ఈ ఇంధనాలకంటే సీఎన్‌జీ శుద్ధమైనది.. సీఎన్‌జీ వినియోగాన్ని పెంచేలా ప్రభుత్వం చొరవ చూపి, ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రకటించాలి.
- గడువు తీరిన వాహనాల సంఖ్య 8 లక్షల పైచిలుకు ఉన్నాయి. వీటిని రోడ్డెక్కకుండా చర్యలు తీసుకోవాలి. వాటిని మార్పిడి చేసి కొత్త వాహనం తీసుకుంటే ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రకటించాలి.
- కాలుష్య నియంత్రణలో వృక్షాలు కీలకపాత్ర పోషిస్తాయి. పచ్చదనాన్ని పెంచాల్సిన అవసరముంది.
- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీఎస్‌పీసీబీ) నిబంధనలు పటిష్ఠంగా అమలుచేయాలి.

సొంతింటి కల నెరవేరాలి



నగరం విస్తరిస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే జనాభా పెరుగుతోంది. గత మూడేళ్లలో కేవలం ఐటీ, ఐటీ ఆధారిత ఉద్యోగులే 1.25లక్షల మంది వరకు పెరిగారని అంచనా. రానున్న రోజుల్లో దిగ్గజ కంపెనీలు మైక్రోసాఫ్ట్, గూగుల్, ఆపిల్ తమ సంస్థలను ఏర్పాటు చేయనున్నాయి. ఫార్మా, ఎలక్ట్రానిక్ రంగాలకు శివారులు కేంద్రాలుగా మారుతున్నాయి. ఇప్పటి అవసరాలతో పోలిస్తే కనీసం 10శాతం అదనంగా ఇళ్లు అవసరమవుతాయి.. చాలామంది 35-40 ఏళ్ల వయస్సు వచ్చేనాటికే సాఫ్ట్‌వేర్ సహా కాస్త వేతనాలు ఎక్కువ పొందే ఉద్యోగులు సొంత ఇంటికలను నెరవేర్చుకుంటున్నారు.

- రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వచ్చే నియోజకవర్గాల్లోనూ పేదలకు రెండు పడకల ఇళ్ల నిర్మాణాలకు కసరత్తు జరుగుతోంది. ప్రతి నియోజకవర్గంలోనూ కనీసం 1400చొప్పున నిర్మిస్తారు.. మొత్తం 150 సముదాయాల పరిధిలో ఇవన్నీ వస్తాయి. పది సముదాయాల్లో ఇళ్ల నిర్మాణాలకు టెండర్లు ఖరారయ్యాయి. బైరాగిగూడ, బండరావిర్యాలలో నిర్మాణాలు ప్రారంభమయ్యాయి.

బల్దియా ఎన్నికలకు ముందు తమకు రెండు పడకల ఇళ్లు కావాలంటూ దాదాపు 2.5లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. మరో లక్ష మంది రంగారెడ్డి కలెక్టరేట్‌లోనూ దరఖాస్తులు చేశారు. వచ్చే ఏడాది చివరినాటికి ప్రభుత్వం హైదరాబాద్ నగరానికి సంబంధించి సుమారు లక్ష ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. 100 మురికి వాడల్లోనూ..శివారు ప్రాంతాల్లోనూ వీటి నిర్మాణం ఉంటుంది. 48వేల ఇళ్లకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. మరో 10వేల ఇళ్లకు ఉన్నతస్థాయి అనుమతులు రావాలి.

ప్రగతి ప్రణాళిక.. నవ్య పథ వీచిక

సాంకేతికతతో నేరాలకు ముకుతాడు



హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ రాజధాని నగరంపై దృష్టి కేంద్రీకరించింది.. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు, నేర నియంత్రణ, దొంగతనాలు, దోపిడీల నియంత్రణకు అత్యాధునిక సమాచార సాంకేతిక పద్ధతులను ప్రవేశపెట్టింది. కేవలం మూడేళ్ల వ్యవధిలో నేరాలు 14శాతం తగ్గాయి. మహిళలు, యువతుల భద్రత కీలకంగా భావించి 'షి' బృందాలను ఏర్పాటు చేశారు.

రానున్న రోజుల్లో..

దేశంలోనే తొలిసారిగా 'ఫ్యూజన్ సెంటర్' పేరుతో పోలీస్ కమిషరేనరేట్ కార్యాలయాన్ని రూపొందిస్తున్నారు. రెండేళ్లలో ఇది పూర్తవుతుంది. అక్కడి నుంచి సీసీ కెమెరాల అనుసంధానంతో ఎక్కడ ఏం జరుగుతుందో వీక్షించొచ్చు. 'షి' బృందాలను ఠాణాల వారీగా పెంచనున్నారు.

వందశాతం పోలీసింగ్‌తో..

-ఎం.మహేందర్‌రెడ్డి, సీపీ, హైదరాబాద్



భవిష్యత్తులో పోలీసింగ్ అంతా ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉంటుంది. చట్టపరిధిలో మరిన్ని సేవలు అందించనున్నాం. ట్రాఫిక్ నియంత్రణను సీసీ కెమెరాల ద్వారా సజావుగా నిర్వహిస్తున్నాం. నేరాలను నియంత్రించడమే కాకుండా రోడ్లపై సాఫీ ప్రయాణంతో పాటు 'డ్రైవింగ్ డెస్టినేషన్' హైదరాబాద్‌గా ఉండాలన్నదే మా లక్ష్యం.

- **వచ్చే అయిదేళ్లపై ఆకాంక్షలెన్నో**
- **కలల సాకారానికి నడుంబిగించాల్సిన ఆవశ్యకత**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు పూర్తయింది. ఈ ఏడు దశాబ్దాల కాలంలో మన భాగ్యనగరం వివిధ రంగాల్లో పురోగమించినా, ఇంకా పలు అంశాల్లో ప్రగతి సాధించాల్సి ఉంది. రాబోయే మూడు దశాబ్దాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని ఇటీవల సీఎం కేసీఆర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇక మరో అయిదేళ్లలో 75 ఏళ్ల స్వాతంత్ర్య సంబరాలనూ జరుపుకోనున్నాం. కనీసం ఈ అయిదేళ్లలో వివిధ రంగాల్లో సమున్నత వృద్ధి సాధించేందుకు తగిన కార్యాచరణతో ముందుకెళ్లాల్సి ఉంది. కొంగొత్త ప్రణాళికలతోపాటు ఇప్పటికే నిర్దేశించుకున్న వివిధ లక్ష్యాల సాధనకు ఏం చేయాల్సి ఉందో అందిస్తున్న ప్రత్యేక కథనమిది. –ఈనాడు, హైదరాబాద్

ఉపాధి చూపే విద్య అవసరం



హైదరాబాద్ మహానగరంలో ఏటా ఎంతోమంది ఉన్నత విద్య పూర్తిచేస్తున్నారు. వీరికి వివిధ అంశాల్లో నైపుణ్యం మెరుగుపర్చడం ద్వారా కొలువులు సాధించేలా చూడొచ్చన్న సూచన నిపుణుల నుంచి వ్యక్తమవుతోంది. ఉపాధి చూపే కోర్సులను రూపొందించాలని తెలంగాణ ప్రభుత్వం వర్సిటీలకు ఇటీవల సూచించింది. అది కార్యరూపం దాల్చితే ముందుముందు సమస్య చాలావరకు తగ్గుతుంది. సమాజంలో భవిష్యత్తు అవసరాలను గుర్తించి అందుకు తగిన విద్య వైపు విద్యార్థులు దృష్టిసారించాలి.

అందరి చూపు ఇటే..

పరిశ్రమల్లో తగినన్ని అవకాశాలున్నా నైపుణ్యత గలవారు దొరకడంలేదు. డిగ్రీ, పీజీలు పూర్తి చేసిన విద్యార్థులు ఆయా అంశాల్లో మళ్లీ శిక్షణ తీసుకోవాల్సి వస్తోంది. ఇదే అంశాలను పాఠ్యాంశాల్లోనే భాగం చేస్తే ఫలితముంటుంది.

ఏ అవకాశాన్నీ వదులుకోవద్దు

-కె.మధుకర్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎంప్లాయిమెంట్ జనరేషన్, మార్కెటింగ్ మిషన్



సమాజంలో ప్రస్తుతం ఉద్యోగ అవకాశాలకు కొదవలేదు. తమ చదువుకు తగినది దక్కాలని చాలా మంది ఎదురుచూస్తూ ఉండిపోతున్నారు. తొలుత ఏ కొలువు దక్కినా చేరాలి. అందులో ప్రతిభ చూపుతూనే నచ్చిన ఉద్యోగానికి అన్వేషించాలి. పనిలో అనుభవం దక్కితే పైస్థాయికి తప్పకుండా చేరుకుంటారు.

దృష్టిపెడితే సుందరీకరణ సాధ్యమే



పట్టణీకరణ ఊపందుకోవడంతో నగరంలో నేడు ఉద్యానవనాల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి.

- రహదారుల మధ్యలో, పైవంతెనల కింద, ప్రభుత్వ కార్యాలయాల్లో తక్కువ నీటతో ఎక్కువ ప్రయోజనం చేకూరే ఉద్యానవనాలను అభివృద్ధి చేయాలి. కార్యాలయాల్లో వర్టికల్ గార్డెన్లు పూర్తిస్థాయిలో ఏర్పాటయ్యేందుకు రెండేళ్లు పడుతుంది. ఎల్అండ్‌టీ మెట్రో రైలు అధికారులు సైతం మెట్రోరైలు మార్గం వెంట మధ్యలో తోటలను పెంచనున్నట్లు తెలిపారు. పాశ్చాత్య దేశాల్లో మాదిరి అందమైన మొక్కలతో వేర్వేరు థీమ్ పార్కులను అభివృద్ధి చేసి, స్టేషన్ల కింద చక్కటి పాదబాటలు, వాటిపై ప్రయాణికులు సేదతీరేందుకు ఎత్తైన మొక్కలు, కుర్చీలను అందుబాటులోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు.
- రానున్న పదేళ్లలో మూసీనది రూపురేఖలు మారుతాయి. బోటింగ్.. నడకదారి.. సైకిల్ మార్గం రాబోతున్నాయి. మురుగునీటిని శుద్ధి చేసి నదిలోకి వదిలేందుకు మూడు భారీ శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పురపాలకశాఖ చెబుతోంది. మూసీ నదికి ఇరువైపులా పచ్చని ఉద్యానవనాలు, ప్రవాహ మార్గంలో 74 చెక్‌డ్యాంలు, ఇతరత్రా అందాలు నగర స్వరూపాన్ని మారుస్తాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

నేటి తరానికి సహజ సంపద చేరాలంటే గ్రేటర్‌లోని ఖాళీ స్థలాలను ఆక్రమణల చెర నుంచి విడిపించి ప్రహరీలు నిర్మించాలి. రూ.10కోట్లతో ప్రహరీలు నిర్మించిన 100 స్థలాల్లో ఉద్యానవనాలు నిర్మించేందుకు ప్రణాళిక రచించామని, రానున్న ఐదేళ్లలో కొత్తగా 500 పార్కులు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. తెలంగాణకే ప్రత్యేకమైన భారీ రాళ్లనూ సంరక్షిస్తామంటున్నారు.

బస్సులు.. అందరికీ చేరువవ్వాలి



గ్రేటర్ హైదరాబాద్ జోన్ అంటే ఒకప్పుడు సిటీ బస్సులు నడపడమే అనుకునేవారు. ఇప్పుడు తెలంగాణేతర ప్రాంతాలకు.. ఆంధ్రా, రాయలసీమలకు నడుపుతోంది. కాలనీల నుంచి సొంత ఊళ్లకు వెళ్లేందుకు సరేసరి. వజ్ర మినీ బస్సులను నడుపుతోంది. మరిన్ని జిల్లాలకు కాలనీల నుంచి నడిపేందుకు దృష్టిసారిస్తోంది.

- మెట్రో అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ప్రధాన మార్గంలో కాకుండా కాలనీల నుంచి ప్రయాణికులను తీసుకువచ్చేలా టీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. వాటిని మెట్రోకు అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటోంది.
- యాప్ సిద్ధంచేసింది. వజ్ర బస్సుల్లో ఆన్‌లైన్ ద్వారా మాత్రమే టిక్కెట్లను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా.. ఆ బస్సు ఎక్కడుంది.. ఎప్పుడు మన ముంగిటకు వస్తుందనేది తెలుసుకునే సౌకర్యాన్ని తీసుకువచ్చారు. సిటీ బస్సులకు కూడా ఈ పరిజ్ఞానం రావాల్సిన ఆవశ్యకత ఉంది. బస్ స్టాపుల్లో సమాచారంతో పాటు.. చరవాణిలో బస్సుల గమనాన్ని తెలుసుకునే వీలుంటే ఉపయుక్తమే.

శివార్లే లక్ష్యంగా చర్యలు

-పురుషోత్తం, ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఈడీ



వచ్చే ఐదేళ్ల నాటికి నగర స్వరూపమే మారిపోనుంది. మెట్రో ఒక పక్క, ఎంఎంటీఎస్ రెండో దశ ప్రజా రవాణాలో పెద్ద పాత్ర పోషించనున్నాయి. ఈ రెండు వ్యవస్థలకు ప్రయాణికులను సమకూర్చే బాధ్యతతో పాటు ఎప్పటికీ ప్రజారవాణాలో ఆర్టీసీదే కీలకమనేలా నిరూపించుకోవాలనేది మా లక్ష్యం. ఇప్పుడు నగర శివార్లలోనే ట్రాఫిక్ జామ్‌లు పెరిగాయి. ఇంజినీరింగ్ కళాశాలలతో ముందుగానే ఒప్పందం కుదుర్చుకొని విద్యార్థులకు బస్సులు అందజేస్తాం. బాహ్య వలయ రహదారి చుట్టూ కాలనీలు, కొత్త టౌన్‌షిప్‌లు వస్తున్నందున ఆర్టీసీ బస్సులు తిరిగేలా ఏర్పాట్లు చేస్తూనే సిటీకి ప్రయాణికులను తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం. నగరశివార్లకు బస్సులను అనుసంధానం చేస్తాం.

వైద్యం.. మరింత తాకిడి

రోజూ ప్రధాన ఆసుపత్రిల్లో రోగులు

- 15-20 వేలు.. అవుట్ పేషెంట్లు
- 3-5 వేలు.. ఇన్‌పేషెంట్లు
- 1000-2000.. అత్యవసర రోగులు
- 500-700 ...మేజర్ శస్త్రచికిత్సలు
- 300-500.. మైనర్ శస్త్రచికిత్సలు

హైదరాబాద్ మెడికల్ హబ్‌గా మారింది. అయినా ప్రభుత్వ దవాఖానాల్లో సమస్యలు వేధిస్తున్నాయి. గత కొంతకాలంగా ప్రభుత్వ వైద్య సేవల్లో మార్పుల కారణంగా 20 శాతం మంది రోగులు పెరిగారు. నిమ్స్, ఉస్మానియా, గాంధీ, ఎంఎన్‌జే, పేట్లబుర్జు ఇలా అన్ని ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరిగింది. గాంధీ, నిమ్స్, నిలోఫర్, పేట్లబుర్జు ఇతర ఆసుపత్రుల్లో ఆధునిక వసతులు సమకూరుతున్నాయి. గతంలో బడ్జెట్‌లో కేటాయించిన నిధులకు తగ్గట్టు పరికరాలు, ఆధునిక ఐసీయూలతో పాటు వార్డుల ఆధునికీకరణ చేపడుతున్నారు. ఇటీవల గాంధీలో 65 పడకలతో అత్యాధునిక అత్యవసర వార్డును గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించారు. కొత్త యంత్రాలు పెట్టారు. 24 గంటలు అందుబాటులో ఉండే సెంట్రల్ లేబొరేటరీ సేవలు నెలరోజుల్లో వస్తున్నాయి.



ప్రభుత్వ రంగంలోని కార్పొరేట్ తరహా ఆసుపత్రి అయిన నిమ్స్‌లోనూ అత్యాధునిక వసతులు వచ్చాయి. అధునాతన క్యాథ్‌ల్యాబ్, స్లీపింగ్ ల్యాబ్ వంటివి అందులో కొన్ని.

ఏం చేయాలి

ఉస్మానియా ఆసుపత్రి పాతభవనం శిథిలావస్థకు చేరుకుంది. కొందరు రోగులను ఇటీవల పేట్లబుర్జుకు తరలించారు. ఇక గాంధీలో అధునాతన పరికరాలు ఉన్నప్పటికీ వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. మరో 200 మంది వైద్యులు, 200 మంది నర్సులు, 600-700 వరకు నాలుగో తరగతి సిబ్బంది అవసరం. ఉస్మానియా, గాంధీ వంటి చోట్ల పది పడకలకు ఒక నర్సు సేవలందిస్తున్నారు. కొన్నిసార్లు అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వైద్యమందక చనిపోతున్నారు. వివాదాలు చోటుచేసుకొని సిబ్బందిపై దాడుల వరకు దారి తీస్తోంది. తక్షణం స్టాఫ్ నర్సులు, నర్సులు, ఇతర నాలుగో తరగతి సిబ్బంది నియామకాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

ఉస్మానియా ఆసుపత్రి పక్కన వేయి పడకలతో రెండు బ్లాక్‌లను కట్టేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. వచ్చే అయిదేళ్లలో అందుబాటులోకి రావాలి. ఎంతో కీలకమైన పారామెడికల్ సిబ్బంది కొరత అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉంది.

ఎంఎంటీఎస్ రెండో దశ సిద్ధమైతే..



నవంబరులో మెట్రో సర్వీసులు నగర ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి. ఇదే సమయంలో ఎంఎంటీఎస్ రెండోదశను కూడా తీసుకురావాలని దక్షిణమధ్య రైల్వే ప్రయత్నిస్తోంది. డిసెంబరు నాటికి ఇది ప్రారంభమవుతుందని జీఎం వినోద్‌కుమార్ యాదవ్ ప్రకటించారు. ఇప్పటికే లింగంపల్లి - తెల్లాపూర్ మార్గం సిద్ధమైంది. బొల్లారం-సికింద్రాబాద్ వరకు రెండో దశ రైళ్లను పరుగులు పెట్టించే అవకాశాలున్నాయి.

వచ్చే ఐదేళ్లలో

ఎంఎంటీఎస్ రెండో దశ 96 కిలోమీటర్లు, మొత్తం 250 సర్వీసులు, 6-7 లక్షల మంది ప్రయాణికుల లక్ష్యంగా ద.మ. రైల్వే అడుగులు వేస్తోంది. రూ.816 కోట్లతో పనులు పూర్తయితే శివార్లలోనే ప్రధాన రైళ్లను ఆపేసి.. క్షణం వృథా కాకుండా ప్రయాణికులను ఎంఎంటీఎస్‌ల ద్వారా నగరంలోకి తీసుకురావచ్చు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.300 కోట్లతో ప్రణాళికలు ఉన్నాయి. చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రధానమైనది కాబోతోంది. నగరం నుంచి యాదగిరి గుట్టకు కూడా రైళ్లు వెళ్తాయి.

సమన్వయంతో ప్రజారవాణా పని చేయాలి

-నూర్‌మహ్మద్, జంటనగరాల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు



ఆర్టీసీ, మెట్రో, ఎంఎంటీఎస్ వ్యవస్థలు సమన్వయంతో పని చేయాలి. మెట్రో, ఎంఎంటీఎస్ రైళ్లలో ప్రయాణించే వారు సులభంగా ఇళ్లకు, కార్యాలయాలకు చేరుకోవాలి. అప్పుడే నగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మినీ బస్సులను కాలనీలకు తిప్పాలి.

కోటిన్నర జనం దాహార్తి తీరేలా

నగర నీటి ముఖ చిత్రం

- 688.20 చ.కి.మీ... మొత్తం సరఫరా ప్రాంతం
- 169.30 చ.కి.మీ.. ఎంసీహెచ్ పరిధి
- 518.90 చ.కి.మీ... గ్రేటర్ మొత్తం
- 8051 కి.మీ.. సరఫరా వ్యవస్థ
- 9.65 లక్షలు.. మొత్తం నల్లాలు
- 650 మిలియన్ గ్యాలన్లు.. నీటి డిమాండ్ రోజుకు
- 420 మిలియన్ గ్యాలన్లు.. ప్రస్తుతం రోజూ ఇచ్చేది

ప్రస్తుతం నగర జనాభా కోటి దాటుతోంది. 2021 నాటికి కోటిన్నర వరకు పెరుగుతుందని జలమండలి అంచనా. రాబోయే అయిదేళ్లలో తాగునీటి అవసరాలు భారీగా పెరుగుతాయి. ప్రభుత్వం కూడా కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే రూ.1900 కోట్లతో శివారు మున్సిపల్ సర్కిళ్లలో తాగునీటి విస్తరణ పనులు చేపట్టింది. మరో ఏడాదిలో ఇవి అందుబాటులోకి వస్తాయి. రింగ్ రోడ్డు లోపల ఉండే 190 గ్రామాలకు రూ.685 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే వేసవి నాటికి దాదాపు 30 గ్రామాలకైనా నీటిని అందించాలనేది యోచన. రాబోయే రెండేళ్లలో ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు.

ఎలాంటి వృథా లేకుండా తాగునీటిని సద్వినియోగం చేసుకోవడమే కాకుండా వర్షపు నీటి సంరక్షణకు అయిదేళ్ల ప్రణాళిక అవసరం. నగర వ్యాప్తంగా యుద్ధప్రాతిపదికన ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి. హెచ్ఎండీఏ పరిధిలో ఏటా 15 టీఎంసీల విలువైన వర్షపాతం పడుతుంది. ఇందులో సగమైనా భూమిలోకి పంపితే జలమండలిపై కూడా భారం తగ్గుతుంది. తద్వారా ప్రజాధనం ఆదా అవుతుంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంకుడుగుంతల క్రతువులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి.

జలాశయాలు



ప్రస్తుతం కృష్ణా మూడు దశలు, గోదావరితోపాటు జంటజలాశయాలు, మంజీరా, సింగూరుల నుంచి నీటిని తీసుకొచ్చి ప్రజలకు ఇస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ప్రాజెక్టుల్లో నీళ్లు తగ్గితే ప్రత్యామ్నాయంగా ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వచ్చే అయిదేళ్లలో అందుబాటులోకి వచ్చేలా ప్రత్యేక రిజర్వాయర్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. కేశవపూర్ వద్ద 20 టీఎంసీల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అందుబాటులోకి తెస్తున్నారు.

కోటి మంది పర్యాటకులు చుట్టాలి



భాగ్యనగరిలో పర్యాటకులను ఆకట్టుకునే కట్టడాలు, ప్రదేశాలకు కొదవ లేదు. వీటిని మరింత పెంచేందుకు తెలంగాణ పర్యాటక శాఖ, పర్యాటకాభివృద్ధి సంస్థ చర్యలు చేపడుతున్నాయి. ప్రస్తుతం నగరానికి ఏడాదికి 49లక్షల మంది సందర్శకులు వస్తున్నారు. వీరిని కోటి చేయడమే లక్ష్యంగా దృష్టి పెట్టారు.

- హుస్సేన్‌సాగర్ జలాల శుద్ధితో బోటు షికారుకు ఎన్నడూ లేని ఆదరణ లభిస్తోంది. రికార్డు స్థాయిలో విహరించి వెళ్తున్నారు. జలవిహార్‌కు కాస్త దూరంలో గగనవిహారం(హెలికాప్టర్ జాయ్ రైడ్) కొనసాగుతోంది. దీనిని చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాలకు విస్తరించాలని పర్యాటక శాఖ ఉంది.
- సందర్శకుల ఇష్టాలను పరిగణలోకి తీసుకుని ఒకటి రెండు రోజుల యాత్రలను సిద్ధం చేస్తున్నారు. వారాంతాలకు అనుగుణంగా నిర్వహించి ఐటీ ఉద్యోగులతో పాటు, నగర ప్రజలకు చక్కటి అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతున్నారు. నాగార్జున సాగర్, మల్లెల తీర్థం ఇలా ఏ ఒక్క పర్యాటక అవకాశాలను వదులుకోకుండా దృష్టి పెడుతున్నారు.

వచ్చే అయిదేళ్లలో

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతాల్లోగోల్ఫ్ క్రీడా మైదానాల నిర్మాణం, బుద్వేల్ వద్ద జలదృశ్యాలతో అతి పెద్ద ఆక్వేరియం, నీటి మడుగులో హోటళ్లు, విందు వినోదాలకు తెరతీయాలని పర్యాటకశాఖ చూస్తోంది. దుర్గం చెరువు, సరూర్‌నగర్ చెరువు, ఐడీఎల్, ప్రగతి చెరువు, శామీర్‌పేట చెరువు, నల్ల చెరువులలో బోటు షికారు తీసుకురానున్నారు.

రెక్కలు కట్టుకు వాలడం ఖాయం

-మామిడి శ్రావణ్‌కుమార్, సికింద్రాబాద్



425 ఏళ్ల పైబడిన చరిత్ర మనది.. నవాబులు నివాసాలుండే రాజప్రాసాదాల్లో బస చేయాలని ఎవరికి ఉండదు. పాతబస్తీలోని చౌమొహల్లా ప్యాలెస్‌లో విడిది ఏర్పాటు చేసి విందుకు అవకాశం ఇవ్వాలే కాని పర్యాటకులను ఆకర్షించడం ఖాయం. నగరంలో ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేయాలి. లుంబినీ పార్కుకు రోజూ 15వేల మంది సందర్శకులు వస్తున్నారు. ఎన్టీఆర్ పార్కు, సంజీవయ్య పార్కు తరహాలోనే మరిన్ని కావాలి. అనంతగిరి హిల్స్‌లో పర్యాటకాభివృద్ధి మరింత జరగాలి.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి



నిందితుడు అలువాల గణేశ్

సైదాబాద్, న్యూస్‌టుడే: ఓ ఫ్లాట్‌లో వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో సైదాబాద్ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి ఆకస్మిక దాడులు చేసి ముగ్గురు నిర్వాహకులతో పాటు ఇద్దరు విటులను అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిర్వాహకులు పరారైయ్యారు. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ కాట్న సత్తయ్య సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని సూర్యా అపార్ట్‌మెంట్‌లోని 203 ఫ్లాట్‌ను సింగరేణి కాలనీకి చెందిన జనార్దన్ (35) పక్షం రోజుల క్రితం అద్దెకు తీసుకున్నాడు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన సరాబ్ కేశవచారి అలియాస్ చిన్న (24)తో కలిసి ఫ్లాట్‌లో వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నాడు. వీరితో మహబూబాబాద్ జిల్లాలోని పెనుగొండకు చెందిన అలువాల గణేశ్ అలియాస్ శివారెడ్డి (23), గద్వాల జిల్లాలోని అయిజ గ్రామానికి చెందిన మురారి శ్రీనివాసులు (40), రాజమండ్రి పిఠాపురంలోని మిరగాల వీధికి చెందిన గజ్జుల లక్ష్మి (35) తదితరులు విజయవాడకు చెందిన 26 ఏళ్ల యువతితో వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేయడంతో జనార్దన్, కేశవచారి పరారైయ్యారు. కేంద్రంలోని గణేశ్, శ్రీనివాసులు, లక్ష్మిలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు విటులు దిల్‌సుఖ్‌నగర్‌లో ఓ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న హయత్‌నగర్ నివాసి కేశగోని సుధాకర్ (35), పంజాగుట్ట లోని ఓ సంస్థలో అడ్మినిస్ట్రేటర్‌గా కొనసాగుతున్న వనస్థలిపురం నివాసి కోట విజయ్‌రెడ్డి (28)లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2 వేల నగదు, 8 చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్న ఫ్లాట్‌ను సీజ్ చేశారు. విజయవాడకు చెందిన 26 ఏళ్ల బాధితురాలిని పునరావాస కేంద్రానికి తరలించారు. ఇటీవల సలీంనగర్‌లో వ్యభిచార కేంద్రంపై మలక్‌పేట పోలీసులు దాడి చేసిన సమయంలోనూ నిందుతులైన గణేశ్, శ్రీనివాసులు, కేశవచారి పరారు కావడం గమనార్హం.

లైంగిక వేధింపుల ఘటనపై నివేదిక

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: గాంధీ ఆసుపత్రిలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురైన సంఘటనపై ముగ్గురు మహిళా ప్రొఫెసర్లతో ఏర్పాటు చేసిన షీ టీమ్ కమిటీ తన నివేదికను ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్‌కు అందజేసింది. ముున్ముందు ఆసుపత్రిలో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు, వేధింపులకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి.. తదితర అంశాలను పరిశీలించి తుది నివేదికను ఇచ్చేందుకు ఈ ముగ్గురితో పాటు మరో నలుగురితో ఇంకో కమిటీని సూపరింటెండెంట్ వేశారు. వారిచ్చే తుది నివేదిక ఆధారంగా నిందితులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆసుపత్రిలో పెథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ విభాగాల్లో ల్యాబొరేటరీల్లో శిక్షణలో ఉన్న తమకు పలువురు యువకులు ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్‌ల ద్వారా అసభ్య సందేశాలను పంపిస్తూ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఇటీవలు పలువురు విద్యార్థినులు సూపరింటెండెంట్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన విషయం విదితమే.

హరితహారంపై దివ్యాంగుడి ప్రచార యాత్ర



మహేశ్‌ను స్వాగతిస్తున్న మంత్రి తలసాని

అమీర్‌పేట, న్యూస్‌టుడే: హరితహారంపై ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో కరీంనగర్‌కు చెందిన దివ్యాంగుడు మహేశ్ రాష్ట్రవ్యాప్త పర్యటన చేస్తూ సోమవారం నగరానికి చేరారు. మహేశ్ యాత్రను మారేడుపల్లిలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్వాగతించారు. సీఎం కేసీఆర్ గత నెల 11న కరీంనగర్‌లో ఈ యాత్రను ప్రారంభించగా, ప్రత్యేక బైక్‌పై 34 రోజుల్లో అన్ని జిల్లాలు పర్యటించినట్లు మహేశ్ తెలిపారు. ఈనెల 16న మంత్రి జోగు రామన్నను కలిసి యాత్రను ముగిస్తానన్నారు. మంత్రి తలసాని మాట్లాడుతూ హరితహారం కార్యక్రమం వల్ల ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతోందని, ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటేందుకు ముందుకొస్తున్నారని పేర్కొన్నారు.



ఎప్పుడూ కటకటే!

కర్మన్‌ఘాట్ గ్రీన్‌పార్క్ కాలనీలో నీటికి తీవ్ర ఇక్కట్లు తప్పడంలేదు. రెండురోజులకోసారి ట్యాంకర్ వస్తుండడంతో నీటిని ఇళ్లముందు ఏర్పాటు చేసుకున్న డ్రమ్ముల్లో నింపుకుని వాడుకుంటున్నారు.

ధర్మం.. అధర్మంగా!

- లక్షలు దోచుకుంటున్న నకిలీ సేవా సంస్థలు
- ఉద్యోగస్థులను నియమించుకుని మరీ వసూళ్లు



హైదరాబాద్, న్యూస్‌టుడే

'తల్లిదండ్రులు లేని అనాథలకు ఎంతో కొంత సహాయం చేయండి...', 'విద్యార్థులకు ఆర్థికస్థోమత లేక చదువును మధ్యలో ఆపేస్తున్నారు. వారికి చేదోడుగా నిలవండి.' 'మలివయసులో బతకలేక జీవితంతో పోరాటం చేస్తున్న వృద్ధులకు మీరు చేసే సహాయం ఓ పూట తిండి ఖర్చుకు వస్తుంది' 'నే అమాయకపు పలకరింపులు మీకు ఎదురయ్యాయా? అయ్యో పాపం... అంటూ జేబులో ఉన్నది 'ధర్మం' చేసేముందు కాస్త పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. చిన్నసహాయమైనా అనాథలకు చేరుతుందా? అంటే పూర్తిగా అవును అని చెప్పలేని స్థితి. ట్రాఫిక్‌లో ఎక్కడపడితే అక్కడ అడ్డుతగిలి అమాయపు మాటలతో అమ్మాయిలు తీసుకునే 'ధర్మం' వారి కడుపునింపుకోవడానికేనని మరువద్దు. కొన్ని నకిలీ సేవా సంస్థలు స్థాపించుకుని సేవల పేరుతో ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారనే విషయం ఓ జాతీయ సంస్థ చేసిన సర్వేలో బట్టబయలైంది. ఎన్ని సేవా సంస్థలు నిజమైన సేవలందిస్తున్నాయన్న లెక్కలు ప్రభుత్వం వద్ద లేవని వివరించింది. నిత్యం ఎక్కడో ఒక చోట వెలుస్తున్న అక్రమ సేవా సంస్థలపై అధికారుల నిఘా లేకపోతే కోట్లాది రూపాయాలు అప్పనంగా అక్రమార్కుల చేతిలోకి వెళ్తాయని వివరించింది.

ఉద్యోగులను నియమించుకుని..

గ్రేటర్‌లో కొన్ని సేవా సంస్థలు డబ్బులు వసూలు చేయడానికి ఉద్యోగులను నియమించుకుంటున్నారు. వీరు ట్రాఫిక్ సిగ్నళ్లు, బస్టాప్‌లు, పార్కుల్లో ఇలా ఎక్కడపడితే అక్కడ కనిపించిన వారిని వదల్లకుండా అమాయక మొహాన్ని పెట్టి స్వచ్ఛంద సంస్థల్లోని అనాథలకు తోచినంత సహాయం చేయండని బతిమిలాడుతారు. ఇచ్చేంత వరకు అక్కడి నుంచి కదల్లరు. ఎంతో కొంత తీసుకుని వెళ్తారు. ఎందుకంటే వీరు ఉద్యోగస్తులు. సదరు ట్రస్టీ వారు టార్గెట్ పెట్టడంతో రోజుకు కనీసం రూ.వెయ్యి రూపాయలైనా సేవల పేరుతో అడుక్కోవాలి. అలా అయితేనే వీరి నెలసరి వేతనం చేతికందుతోంది. అది కూడా రూ.5 నుంచి 7వేలు మాత్రమే. యువతులు, యువకులు మహిళలు, పురుషులు, మైనర్లను కూడా ఉద్యోగులుగా చేర్చుకుని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇలా నగరంలో నిత్యం సుమారు 200 మంది దాక ఉపాధి పొందుతున్నారనే విషయాలు వెలుగులోకి వచ్చాయి. మూడేళ్ల కిందట రామాంతాపూర్‌లో ఓ స్వచ్ఛంద సంస్థ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఆ సంస్థ యువతి అనాథ పిల్లల కోసం సహాయం చేయమని చెప్పడంతో.. సదరు దానకర్ణుడు.. సంస్థ కార్డు ఇస్తే... తన మనవరాలి జన్మదిన వేడుకలు అనాథ పిల్లల నడుమ జరుపుతామని చెప్పడంతో సదరు యువతి కంగుతిని నోటికొచ్చిన చిరునామాను చెప్పింది. మరుసటి రోజు అదే చిరునామా ప్రకారం వెళితే అక్కడ ఓ ఖాళీ స్థలంలో టీ కొట్టు ఉంది. సేవల పేరుతో దోచుకుంటున్నాడని అంబర్‌పేట పోలీస్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఈ ఉదంతం పెను సంచలనంగా మారింది. ఆ తరువాత కాలంలో ఎన్నో సేవాసంస్థలపై ఆరోపణలు వచ్చిన అధికారులు పెడచెవిన పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా ఘటన జరిగితే కానీ అధికారులు దర్యాప్తు చేపట్టరని పలువురు దాతలు విమర్శిస్తున్నారు.

బడా కంపెనీలను సైతం..

ఉద్యోగులు తక్కువ మొత్తంలో వసూలు చేస్తే ఆయా సేవా సంస్థల నిర్వాహకులు మాత్రం కారులో హుందాగా వెళ్తూ వేలు, లక్షల రూపాయలు వసూళ్లు చేస్తున్నారని సర్వే వెల్లడించింది. ముఖ్యంగా హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న ఎన్ఆర్ఐ ట్రస్టులు, కులాలు, విద్యా, మెడికల్‌తో పాటు పలు పేర్లతో స్థాపించుకుని రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని వివరించింది. వాటిలో సగం మాత్రమే సేవలకు వినియోగిస్తూ మిగిలిన డబ్బులను వెనుకేసుకుంటున్నారని పేర్కొంది. ట్రస్టుల అక్రమ వ్యవహార కార్యకలాపాలు కోల్‌కతాలోనే అధికంగా కొనసాగుతున్నాయి. తరువాత స్థానంలో బెంగళూరు, చెన్నై ఇంకా పలు నగరాలు ఉన్నాయి. ఎన్ఆర్ఐల పేరుతో ముంబయి, బెంగళూరు, హైదరాబాద్‌లో ఉన్నాయని వివరించింది.

మట్టి గణపతి ప్రతిమల తయారీకి ప్రోత్సాహం

- గ్రేటర్ మేయర్ బొంతు రామ్మోహన్



మట్టి ప్రతిమలనే ప్రోత్సహిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న నేతలు

నార్సింగి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని ఇందుకోసం జీహెచ్ఎంసీ తరపున తయారీదారులకు శిక్షణ ఇప్పించి, ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. నార్సింగి గ్రామంలో 'సేవ్' సంస్థ ఆధ్వర్యంలో విజయరాజ్ తయారు చేయిస్తున్న మట్టి వినాయకుల తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, గాంధీలతో కలిసి ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మట్టి వినాయకులపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 17న మాదాపూర్ శిల్పకళా వేదికలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గణేశ మండపాల నిర్వాహకులు మట్టి గణేశులను ప్రోత్సహించి పర్యావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. మట్టి విగ్రహాలు ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా పలు ప్రాంతాలలో తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ నెక్నాంపూర్, పత్తికుంట చెరువులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కాలనీల్లోనే వినాయకులను నిమజ్జనం చేయించి, మొక్క నాటేలా ప్రచారం చేస్తున్నామన్నారు. తాము తయారు చేసే వినాయకుల ద్వారా 150 కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని, మట్టివినాయకులతో పాటు దోవతీ, కండువాలు అందించడం ద్వారా 500 చేనేత కుటుంబాలకు ఆరు నెలలు ఉపాధి కల్పిస్తున్నామని సేవ్ సంస్థ ప్రతినిధి విజయరాజ్ చెప్పారు. వినాయకుల తయారీలో శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సందర్భంగా మట్టి వినాయకులను ప్రోత్సహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ తలారి మల్లేష్, అశోక్‌యాదవ్, రామకృష్ణారెడ్డి, నర్సింహా, మహేందర్‌గౌడ్, నీలేష్‌దూబే, రాందాస్, వెంకటేశ్‌యాదవ్, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి మరో 15 కోనేర్లు

రాయదుర్గం, న్యూస్‌టుడే: నగరంలో వినాయక నిమజ్జనానికి మరో పదిహేను కోనేర్లను నిర్మిస్తున్నట్లు నగర మేయర్ బొంతు రామ్మోహన్ చెప్పారు. ఆయన సోమవారం రాయదుర్గం మల్కం చెరువు సుందరీకరణ పనులు, అక్కడి వినాయక నిమజ్జన కోనేరును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత యేడాది నిర్మాణం పూర్తయిన కోనేర్లలోంచి వ్యర్థాల తొలగింపు, పారిశుద్ధ్య పనులను చేపట్టి నిమజ్జనానికి సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. రాయదుర్గం మల్కం చెరువు సుందరీకరణ పనులు సకాలంలో పూర్తయ్యేలా చూస్తున్నామన్నారు. అనంతరం ఆయన రాయదుర్గం వార్డు కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ మట్టి విగ్రహాలకు తొట్టెలను అతికించడం, అందులో మొక్కలు ఉంచే విధానాన్ని పరిశీలించారు. మహిళా సంఘాలు, విద్యార్థులు ఆ పనులు చేపడుతున్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, జీహెచ్ఎంసీ పశ్చిమ మండల జోనల్ కమిషనర్ హరించందన, కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, అధికారులు పాల్గొన్నారు.

కాదేదీ వ్యర్థం.. ఉంది ఓ అర్థం!

కాచిగూడ, న్యూస్‌టుడే

తగిన దృష్టి పెట్టాలేగాని ఏదీ నిరుపయోగం కాదు.. ఏదీ వృథాగా పడేసేది కాదు. 'చెత్త' అనే పేరు వింటేనే పనికిరానిదిగా భావిస్తుంటాం. కానీ అదే చెత్తతో ఎరువు తయారుచేయొచ్చు. విద్యుత్తు ఉత్పత్తి చేయొచ్చు. సరిగ్గా దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ కూడా అదే ఆలోచన చేసింది. కాచిగూడ రైల్వే స్టేషన్, రైల్వే కాలనీల్లోని అధికారులు, సిబ్బంది నివాసాలు, రైల్వే క్యాంటీన్ల నుంచి సేకరించిన కూరగాయలు, ఆహార పదార్థాల వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను తయారుచేస్తోంది. దానిని రైల్వే ఉన్నతాధికారుల కార్యాలయాలు, నివాసాలలోని తోటల్లో వినియోగిస్తోంది. దీని వల్ల ఆర్థికంగానూ ప్రయోజనం చేకూరుతోంది. వ్యర్థాలను సుదూర ప్రాంతంలో ఉన్న జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించే అవస్థా తప్పింది.

సేంద్రియ ఎరువులు తయారుచేస్తోన్న రైల్వే

కార్యాలయాలు, భవనాల తోటలకు వినియోగం



ఆహ్లాదకరంగా సికింద్రాబాద్ రైల్వే పరిసరాలు

బెంగళూర్ నుంచి కొనుగోలు

కాచిగూడ రైల్వే క్వార్టర్స్, రైల్వే క్యాంటీన్ల వద్ద కూరగాయలు, తినుబండారాల వ్యర్థాలు పేరుకుపోయి గతంలో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడేది. వీటితో స్థానికంగా దుర్గంధం వ్యాపించేది. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ స్టేషన్‌ను సందర్శించిన అప్పటి దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం) అరుణాసింగ్ ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనాలని అధికారులకు సూచించారు. వ్యర్థాలతో సేంద్రియ ఎరువులను తయారుచేయొచ్చని అధికారులు ప్రతిపాదించారు. బెంగళూర్‌లోని ప్రైవేట్ సంస్థను సంప్రదించి రూ.5 లక్షల వ్యయంతో రీ కంపోస్ట్ యంత్రాన్ని ఈ యేడాది జనవరిలో కొనుగోలు చేశారు. దీనిని కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసి నిర్వహణను రైల్వే ఆరోగ్య, పారిశుద్ధ్య విభాగానికి అప్పగించారు. దీంతో ఎరువు తయారు చేస్తున్నారు.



రీ కంపోస్టింగ్ యంత్రం

కూరగాయల సాగు



కాచిగూడలో సాగు చేస్తున్న పెసర

ఈ సేంద్రియ ఎరువుతో స్థానికంగా కాచిగూడ రైల్వే స్థలంలో ప్రయోగాత్మకంగా పెసర పంటతో పాటు గోంగూర, పాలకూర, పొట్ల కాయ, బెండ, కాకర సాగు చేస్తున్నారు. అలానే ప్రతి నెలా నాలుగు క్వింటాళ్ల ఎరువును రైల్వే హైదరాబాద్ డివిజన్ ఇంజినీరింగ్ విభాగానికి ఇక్కడి నుంచి పంపిస్తున్నారు. వారు సికింద్రాబాద్ రైల్ నిలయం, హైదరాబాద్ భవన్, సౌత్ లాలాగూడలోని రైల్వే జీఎం, డీఆర్‌ఎంలు, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్, రైల్వే సేఫ్టీ కార్యాలయాలు, ఆవాసాలలో గల తోటల్లోని మొక్కలకు వినియోగిస్తున్నారు. తద్వారా రసాయన ఎరువుల కొనుగోలు చాలా వరకు తగ్గిపోయింది. పర్యావరణ హితమూ సాధ్యమవుతోంది.



తయారైన సేంద్రియ ఎరువు

3 టన్నుల వరకు

రైల్వే వారు రీ కంపోస్ట్ యంత్రాన్ని కొనుగోలు చేయకముందు ప్రతి నెలా కాచిగూడ స్టేషన్, క్వార్టర్ల ద్వారా 12 లారీల వరకు చెత్త, వ్యర్థాలు వచ్చేవి. వీటిని 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించేవారు. తద్వారా మానవ వనరుల సమయం, ఇంధనం వృథా అయ్యేది. ప్రస్తుతం వ్యర్థాలను రోజుకు 125 కిలోల వరకు రీ కంపోస్ట్ యంత్రంలో వేస్తున్నారు. యంత్రంలోని బ్యాక్టీరియా, తేమ, వేడి ప్రక్రియతో 25 నుంచి 30 కిలోల వరకు పొడి ఎరువు తయారవుతుంది. నెలకు నాలుగు క్వింటాళ్ల చొప్పున ఎరువు తయారవుతోంది. ఈ ఆగస్టు నాటికి మొత్తంగా 3 టన్నుల వరకు తయారు చేశారు. బహిరంగ మార్కెట్లో దీని విలువ రూ. 2 లక్షల వరకు ఉంటుంది.

సత్ఫలితాలు వస్తున్నాయి

-సోమరాజు, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్, కాచిగూడ రైల్వే స్టేషన్



ఎనిమిది నెలల క్రితం కొనుగోలు చేసిన రీ కంపోస్టింగ్ యంత్రంతో సత్ఫలితాలు వస్తున్నాయి. రైల్వే స్టేషన్, కాలనీల్లో పారిశుద్ధ్యం మరింత మెరుగైంది. చెత్త, వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించే సమస్య చాలావరకు తగ్గింది

లయన్స్ సేవలను విస్తరించాలి

ప్రపంచవ్యాప్త కార్యక్రమాల నిర్వహణకు 15 వేల డాలర్ల వితరణ



కార్యక్రమంలో ప్రసంగిస్తు న్న లక్ష్మీనారాయణ

కాప్రా, న్యూస్‌టుడే: సమాజంలో నిరుపేద అభ్యున్నతి, అంధత్వ నివారణ కోసం లయన్స్ సంస్థలు చేస్తున్న సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహారాష్ట్ర అదనపు డీజీపీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. కాప్రాలోని సాకేత్ టౌన్‌షిప్‌లోని లక్ష్మారెడ్డి గార్డెన్స్‌లో సోమవారం సింహ శతాబ్ది పేరున అంతర్జాతీయ లయన్స్‌క్లబ్ జిల్లా 320సి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లాభాపేక్ష లేకుండా సమాజ సేవ కోసం తమ విలువైన సమయాన్ని, డబ్బును వెచ్చిస్తున్న లయన్స్ సభ్యుల సేవలను ఆయన అభినందించారు. అంతర్జాతీయ లయన్స్ క్లబ్ జిల్లా 320సి డిస్ట్రిక్ట్ గవర్నర్ బి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ 1వ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా జీఎస్ ప్రహ్లాద్, 2వ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా పి. రవీంద్రనాథ్‌గుప్తా, లయన్స్ జిల్లా కార్యవర్గాలు ప్రమాణస్వీకారం చేశాయి. మాజీ అంతర్జాతీయ లయన్స్ క్లబ్ డైరెక్టర్ సభ్యులు వినోద్‌ఖన్నా సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ ద్వారా చేసే ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణ కోసం 15 వేల డాలర్లను లయన్స్ సభ్యులు విరాళంగా ఇచ్చినట్లు గవర్నర్ బి.వెంకటేశ్వరావు వెల్లడించారు. కార్యక్రమంలో లయన్స్ మాజీ జిల్లా గవర్నర్లు, ఈసీఐఎల్ ఎలైట్ క్లబ్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, మూర్తి, గోపాలరావు, కొత్తరామారావు, మనోహర్‌రాజు, హేమాద్రి, అశోక్, నందా శ్రీనివాస్, ఏవీఆర్ దత్తూ, 48 క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



బాడీ బిల్డర్ మహమ్మద్ అన్వర్‌ను అభినందిస్తున్న మంత్రి పద్మారావు

కాచిగూడ, న్యూస్‌టుడే: దక్షిణ కొరియాలో జరుగనున్న ఆసియా బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన మహమ్మద్ అన్వర్‌ను రాష్ట్ర క్రీడల మంత్రి పద్మారావు సన్మానించి అభినందించారు. ఈ నెల 20 నుంచి 26 వరకు దక్షిణ కొరియాలో జరుగనున్న పోటీలకు 70 కిలోల విభాగంలో ఎంపికైన మహమ్మద్ అన్వర్‌ను సోమవారం నగరంలోని చప్పల్‌బజార్‌లోని తెరాస కాచిగూడ డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వర్ణ పతకంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎక్కాల కన్నా, కోచ్ సంతోష్‌కుమార్, రయీస్, అంకిత్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే



మాట్లాడుతున్న నాయిని నర్సింహారెడ్డి

సుల్తాన్‌బజార్: రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని రాష్ట్ర హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయాలపై మహాత్మా గాంధీజీ చేపట్టిన చంపారన్ సత్యాగ్రహ శత వార్షికోత్సవం సందర్భంగా రూపొందించిన ప్రత్యేక పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం రాత్రి సుల్తాన్‌బజార్ శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో జరిగింది. మాజీ శాసనసభ్యులు, హైదరాబాద్ రైటర్స్, ప్రింటర్స్, పబ్లిషర్స్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు పి.జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర హోంమంత్రి నాయిని ముఖ్యఅతిథిగా హాజరై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నాయిని మాట్లాడుతూ దేశానికి రైతే వెన్నెముక అని, రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ వ్యవసాయానికి, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతున్నారన్నారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా కోటి ఎకరాలకు నీరందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ రైతు సమస్యలపై గాంధీజీ చేపట్టిన చంపారన్ సత్యాగ్రహం చారిత్రక మహోద్యమం అన్నారు. చారిత్రక సత్యాగ్రహం వందేళ్లు పూర్తి చేసుకున్నా, రైతాంగం ఇంకా సంక్షోభంలో ఉందన్నారు. కార్యక్రమంలో డా.జి.ఆర్.ఎస్.రావు, డా.జి.వి.రామాంజనేయులు, ఎం.సూర్యానాయక్, సోమయ్య, మమతా గుప్తా తదితరులు పాల్గొన్నారు.





ప్రమాదకర ప్రయాణం

నగరంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. కొందరు నిబంధనలను ఉల్లంఘిస్తూ ద్విచక్రవాహనాలపై ఐదారుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. గోతుల్లో వాహనాలు అదుపుతప్పితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ దృశ్యాలు జూ పార్కు, చార్మినార్ ప్రాంతాల్లో కనిపించాయి.

వ్యర్థాలమయం.. నివాసం దుర్భరం



- చెత్త తరలింపు కేంద్రం నానా ఇబ్బందులు
- పార్కు స్థలాన్ని డంపింగ్ యార్డు మార్చిన అధికారులు
- శేరిలింగంపల్లి నల్లగండ్ల వద్ద రోగాల బారిన స్థానికులు

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే

స్వచ్ఛమైన వాతావరణం.. రణగొణధ్వనులు లేని పరిసరాలు. . దుమ్ము ధూళి లేని రహదారులు ఉన్న ప్రాంతాల్లో వారంతా నివాసం ఏర్పాటు చేసుకుందామనుకున్నారు. నగర శివారు ప్రాంతమైతే మంచిదనుకుని ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. పగలంతా కార్యాలయాల్లో పని ఒత్తిడితో ఆందోళన పడి సాయంత్రం ఇంటికి చేరితే ముక్కుపుటాలు అదిరే దుర్వాసనతో అక్కడి ప్రజలు పడుతున్న వేదన అంతాఇంతా కాదు. దాదాపు 15వేల కుటుంబాలు నిత్యనరకం చూస్తున్నారు. రోగాల బారిన పడి నానాఇక్కట్ల పాలవుతున్నారు.

శేరిలింగంపల్లి నల్లగండ్ల హుడా లేవుట్ వద్ద పార్కు కోసం పదెకరాలు కేటాయించారు. అధికారులు మాత్రం దాన్ని చెత్త తరలింపు కేంద్రం పేరిట డంపింగ్ యార్డుగా మార్చివేశారు. నిత్యం ఇక్కడికి 150 నుంచి 170 టన్నుల చెత్తను దాదాపు 90 ఆటోల్లో తీసుకువచ్చి పారేస్తున్నారు. ఈ చెత్తను తిరిగి జేసీబీ సాయంతో పెద్ద వాహనాల్లో ఎత్తి జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలి ఉన్నా.. జాప్యం జరుగుతోంది. దీంతో టన్నుల కొద్దీ చెత్త పేరుకుని స్థానికంగా తీవ్ర అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. ఇక్కడి నుంచి వచ్చే దుర్వాసనతో స్థానికంగా నివాసం ఉండలేని దుస్థితి నెలకొంది. 'న్యూస్‌టుడే' క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య సగానికి తగ్గిపోయిందని నిర్వాహకులు తెలిపారు. డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్వాసన కారణంగా పిల్లలు రావడం మానేశారని చెబుతున్నారు. వాస్తవానికి డంపింగ్‌యార్డు విషయంలో అధికారులు ప్రణాళిక లేకుండా వ్యవహరించారు. గత పదేళ్ల వ్యవధిలో మూడు ప్రాంతాలకు చెత్త తరలింపు కేంద్రాలను మార్చారు.

తరలింపు కేంద్రం అంటే.. చెత్త తరలింపు కేంద్రం అంటే సర్కిల్ పరిధిలోని ప్రాంతాల్లోంచి స్వచ్ఛ ఆటోలతో సేకరించిన వ్యర్థాలను ఒకచోటకు తీసుకువచ్చి పడేస్తారు. అదే రోజు లేదా మరుసటి రోజు చెత్తని భారీ టిప్పర్లలో ప్రధాన డంపింగ్ కేంద్రానికి తరలించాలి. దీని ప్రకారం శివారు ప్రాంతాల్లో పలు సర్కిళ్ల పరిధిలో చెత్త తరలింపు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జేసీబీ, టిప్పర్లు సక్రమంగా నడిపించకుండా ఉండటంతో చెత్త తరలింపు కేంద్రాలు కాస్త డంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయి.

స్థలం దొరకడం గగనం.. చెత్త తరలింపు కేంద్రానికి భూమి కేటాయింపు వ్యవహారం ప్రహసనంగా మారింది. గతంలో మెదక్ జిల్లాలో లక్డారంలో భూమి కేటాయింపునకు అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. ఆచరణలో ముందుకు సాగలేదు. తర్వాత అవుటర్ రింగురోడ్డు అవతల వట్టినాగులపల్లి ప్రాంతానికి చెత్త తరలింపు కేంద్రాన్ని మార్చుతారని భావించారు. ఇది కూడా ముందుకు సాగలేదు.

మొదటి నుంచి అంతే..

వాస్తవానికి కొన్నేళ్ల కిందట భెల్ ఎంఐజీ కాలనీ దగ్గర చెత్త తరలింపు కేంద్రం పేరుతో ఆటోలు, రిక్షాలు సరాసరి ర్యాంపు మీద నుంచి టిప్పర్లలో పోసేలా రూ.లక్షలు వెచ్చించి ర్యాంపు నిర్మాణం చేశారు. దీన్ని సరిగా వినియోగించక చెత్త పేరుకుపోయింది. అనంతరం స్థానికుల ఆందోళనతో నల్లగండ్ల హుడా లేవుట్ ప్రాంతానికి కేంద్రాన్ని తరలించారు. దాదాపు ఆరు ఎకరాల విస్తీర్ణం ఉన్న పార్కు స్థలంలోకి దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడా స్థానికుల ఇబ్బందుల దృష్ట్యా దగ్గర్లోని పదెకరాల పార్కు స్థలంలోకి తరలించారు. దీనిపై అప్పట్లో ఆక్షేపణలు వచ్చినా అధికారులు ఏ రోజు చెత్త ఆరోజు తరలిస్తామని హామీతో ఇవ్వడంతో స్థానికులు ఒప్పుకొన్నారు. అలాగే ఇక్కడ తడి, పొడి చెత్త వేరు చేసేందుకు షెడ్డును ఏర్పాటు చేశారు.



డంపింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన షెడ్డు

ఎప్పటికప్పుడు తరలిస్తే సమస్య రాదు

చెత్త తరలింపు కేంద్రాల్లో ఏ రోజుకారోజు చెత్త తరలిస్తే సమస్య తలెత్తదు. ఇక్కడ సమస్యపై ప్రతి రోజు తరలింపు అంశంపై వివరణ తీసుకుంటా. పూర్తి స్థాయిలో చెత్తను తరలించేలా చూస్తాం. చెత్త తరలింపు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాలు చూస్తున్నాం. గతంలో లక్డారంలో భూమి అంశంపై ముందుకెళ్లాము. కొన్ని సమస్యలతో ఆగింది. ఈ భూమితో పాటు మిగిలిన ప్రాంతాల్లో స్థల కేటాయింపుపై ప్రతిపాదనలపై దృష్టి సారించాలి.

– గ్రేటర్ హెల్త్ అండ్ శానిటేషన్ అదనపు కమిషనర్ ఎన్.రవికిరణ్

పేరుకున్న వ్యర్థాలు

ప్రస్తుతం నల్లగండ్ల హుడా లేవుట్ ప్రాంతంలోని చెత్త తరలింపు కేంద్రం కాస్త.. డంపింగ్ కేంద్రంగా మారిపోయింది. పెద్దయెత్తున చెత్త పేరుకుపోతోంది. ఆటోల్లో వచ్చే చెత్తను రోజూ టిప్పర్లలో కైత్లాపూర్‌కు తరలించాల్సి ఉండగా సక్రమంగా తరలించడం లేదు. తీసుకొచ్చిన చెత్త టన్నుల కొద్ది అక్కడే ఉండిపోతోంది. తడి, పొడి చెత్త విభజన సరిగా జరగడం లేదు. స్థానికంగా దోమలు, ఈగల బెడదతో పరిసర ప్రాంతాల్లో ఉంటున్న వారు హడలి పోతున్నారు. నల్లగండ్ల హుడా లేవుట్ నివాసితులతోపాటు అపర్ణ సరోవర్, అపర్ణ జోన్, అపర్ణ గ్రాండ్, నల్లగండ్ల గ్రామం, రాంకీ అపార్టుమెంట్స్, రాఘవేంద్ర అపార్టుమెంట్స్‌లో ఉంటున్న 15వేల కుటుంబాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పశువులు కూడా చెత్తలోని ప్లాస్టిక్‌వ్యర్థాలనే తింటున్నాయి. ఇక్కడే చెత్తను తగలపెడుతున్నారు. ఆ సమయంలో పెద్దఎత్తున దుర్వాసన, పొగ వ్యాపించి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

చిక్కడపల్లి ఏసీపీ నర్సయ్యకు ఇండియన్ పోలీస్ మెడల్



ఏసీపీ జోగుల నర్సయ్య

రాంనగర్, న్యూస్‌టుడే: చిక్కడపల్లి ఏసీపీ జోగుల నర్సయ్య ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం)కు ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందజేసే సేవా పథకాల్లో భాగంగా ఆయనకు ఈ అవార్డు దక్కింది. యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం లక్ష్మాపురంనకు చెందిన నర్సయ్య 1991లో ఎస్సైగా బంజారాహిల్స్ ఠాణాలో బాధ్యతలు చేపట్టారు. తర్వాత అంబర్‌పేట్, గాంధీనగర్, కాచిగూడ పోలీసుస్టేషన్లలో పనిచేశారు. 2005లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన ఆత్మకూర్(గద్వాల్)లో పనిచేశారు. నగరంలోని పంజాగుట్ట, టప్పాచబుత్ర, టాస్క్‌ఫోర్స్, ఆసిఫ్‌నగర్ ఠాణాలలో పనిచేశారు. 2014లో ఏసీపీగా పదోన్నతి పొంది అప్పటి నుంచి చిక్కడపల్లి డివిజన్ ఏసీపీగా కొనసాగుతున్నారు. 2010, 2015లలో రాష్ట్ర ప్రభుత్వ సేవా పతకాలను పొందారు.

మహిళా జైలు చీఫ్ హెడ్‌వార్డర్‌కు రాష్ట్రపతి పురస్కారం



ప్రమీలాభాయి

మాదన్నపేట, న్యూస్‌టుడే: 2017 ఏడాదికిగానూ రాష్ట్రపతి అవార్డుకు తెలంగాణ జైళ్ల శాఖ నుంచి మహిళా జైలు చీఫ్ హెడ్‌వార్డర్ ప్రమీలాభాయి ఎంపికైనట్లు జైలు పర్యవేక్షణాధికారి బషీరాబేగం తెలిపారు. వరంగల్‌కు చెందిన ప్రమీలాభాయి 30 ఏళ్లుగా జైళ్ల శాఖలో విధులు నిర్వహిస్తున్నారని, గతంలో వరంగల్ మహిళా జైలు, ప్రస్తుతం చంచల్‌గూడ మహిళా ప్రత్యేక జైల్లో చీఫ్ హెడ్‌వార్డర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ప్రమీలా భాయి 1986లో జైళ్ల శాఖలో వార్డర్‌గా విధుల్లో చేరారు. జైళ్ల శాఖలో అత్యుత్తమంగా విధులు నిర్వహించినందుకు ఈమెను రాష్ట్రపతి అవార్డు వరించినట్లు అధికారులు తెలిపారు. ఈమె భర్త సారయ్య కూడా వరంగల్ జైల్లో హెడ్ వార్డర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



అభిషేకం చేస్తున్న అర్చకులు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: భక్తుల జయజయధ్వానాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ బంజారాహిల్స్‌లోని స్వయంభు శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా ఆరంభమయ్యాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్‌శాఖ అధ్యక్షులు సత్య గౌర చంద్రదాస పర్యవేక్షణలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. మూడురోజులపాటు కొనసాగే ఈ వేడుకలకు సోమవారం పలువురు ప్రముఖులు హాజరై స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఉదయం నిర్వహించిన కార్యక్రమాల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. రామలింగేశ్వరరావు, కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇన్‌కంట్యాక్స్ జాయింట్ కమిషనర్ రాఘవేంద్రరావు, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రఘుప్రసాద్ పాల్గొన్నారు. హెరిటేజ్ ఫెస్ట్‌లో రాధాకృష్ణ వేషధారులైన చిన్నారులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, స్థానిక కార్పొరేటర్ గద్వాల్ విజయలక్ష్మి చేతులమీదుగా మంగళవారం ఉబహుమతి ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

'చరిత్రకు సాక్ష్యాలు ఛాయాచిత్రాలు'



చిత్రాలు తిలకిస్తున్న నందిని సిధారెడ్డి తదితరులు

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఛాయాచిత్రాలు చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తాయని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ (టీఫొజేఏ) ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో ఛాయాచిత్రాల పోటీ ప్రదర్శన సోమవారం రాత్రి రవీంద్రభారతి కారిడార్‌లో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. చూడటానికి అది చిత్రమే అయిన ఎన్నో భావోద్వేగాలను ప్రకటిస్తుందన్నారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తదితరులు మాట్లాడారు. సంఘం అధ్యక్షులు భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 216 ఎంట్రీలు, 1115 ఫొటోలు పోటీకి వచ్చాయన్నారు. అందులో 393 ఎంపిక చేసి ప్రదర్శనకు ఉంచామన్నారు. ఈ ప్రదర్శన ఈనెల 19న ముగుస్తుందన్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నేడు

అబిడ్స్: ఇస్కాన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆబిడ్స్‌లోని హరే రామ హరే కృష్ణ (ఇస్కాన్) మందిరంలో ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు ఇస్కాన్ హైదరాబాద్ శాఖ అధ్యక్షులు వేదాంత చైతన్య దాస్ తెలిపారు. సోమవారం అబిడ్స్‌లోని ఇస్కాన్ మందిరంలో పీఆర్వో శంభూదాస్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల నుంచి ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆరంభం అవుతాయని తెలిపారు. లక్ష మంది పాల్గొనే ఈ వేడుకల కోసం అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మేళాతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అడవుల్లో ఎక్కువగా కనిపించే ఎర్ర సాలీడు నగరంలో అరుదుగానే కనిపిస్తుంది. పంజాగుట్టలోని ఓ ఇంటి వద్ద గూడు అల్లుతూ కనిపించిందిలా..



సాలీడు.. అల్లుకున్న గూడు